
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ
RNI No. APTEL/2004/12176
epaper : https://varthaprabha.com
సమగ్ర వార్తా దినపత్రిక
Circulated Telangana & Andhra Pradesh States



Y. Sreedevi
Proprietor
9397317951
Cell: 9515348320
GST : 36AHXPY3131E1ZX
NANDINI MEMENTOS
Corporate Gifting & Printing Services
Specialists in Medals*Gift Items*Shalls

E.mail- nandinimementos2@gmail.com
Chikkadpally, Hyderabad 500 020.



సంపుటి : 23 | సంచిక : 210 | ది. 24-10-2024 | విజయవాడ | గురువారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


# ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

## శారదాపీఠానికి భూముల కేటాయింపు రద్దు : ఏపీ క్యాబినెట్



**అమరావతి,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** శారదాపీఠానికి భూముల కేటాయింపును రద్దు చేస్తూ ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. బుధవారం ఉదయం సీఎం చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన ఏపీ మంత్రి వర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.

**దీపావళి నుంచి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు..** దీపావళి నుంచి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నగదు చెల్లించి సిలిండర్ కొనుగోలు చేస్తే 48 గంటల్లో తిరిగి అకౌంట్‌లో నగదు జమయ్యేలా చూడాలని నిర్ణయించారు. ఒకేసారి మూడు సిలిండర్లు తీసుకోకుండా ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై ఏడాదికి రూ.2700 కోట్ల భారం పడుతుందని మంత్రివర్గంలో చర్చ జరిగింది.

**ఉచిత ఇసుక విధానంలో సీనరేజ్, జీఎస్టీ ఛార్జీల రద్దు..** ఉచిత ఇసుక విధానంలో సీనరేజ్, జీఎస్టీ ఛార్జీల రద్దుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీనరేజ్ ఛార్జీల రద్దు వల్లే ప్రభుత్వంపై రూ.264 కోట్ల భారమని అంచనా వేశారు. ఉచిత ఇసుక లక్ష్యం నెరవేర్చేందుకు నష్టం భరిద్దామని సీఎం చెప్పినట్టు సమాచారం. పట్టా భూముల్లో ఎవరి ఇసుక వారు తీసుకునేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉచిత ఇసుక సరిగా అమలయ్యేలా చూడాలని మంత్రులు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇసుక లేని జిల్లాల్లో మినరల్ డీలర్లను పెట్టి ధరల నియంత్రణ చేపట్టాలని నిర్ణయించారు. ఆలయ కమిటీల్లో బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులకు చోటు కల్పించేందుకు, సభ్యుల సంఖ్య పెంచే చట్ట సవరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

**విశాఖ శారదాపీఠానికి భూ కేటాయింపు రద్దు..** విశాఖకు చెందిన వివాదాస్పద పీఠాధిపతి స్వరూపానందేంద్రకు చెందిన శారదాపీఠానికి గత జగన్ ప్రభుత్వం ఇచ్చిన 15 ఎకరాల అత్యంత విలువైన భూమిని వెనక్కి తీసుకోవాలనే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ తన గురువు, అత్యంత సన్నిహితుడైన స్వరూపానందేంద్ర కోరిక మేరకు %% భీమిలి పట్టణాన్ని ఆనుకుని కొత్తవలస గ్రామ పరిధిలో, సముద్ర తీరానికి దగ్గర్లో రూ.కోట్ల విలువ చేసే భూమిని ఎకరం రూ.లక్ష చొప్పున ఇచ్చారనీ, గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ భూ కేటాయింపులపై సమీక్షలో భాగంగా ఎన్డీయే ప్రభుత్వం దీన్ని గుర్తించిందని మంత్రివర్గం తెలిపింది. శారదాపీఠానికి భూముల కేటాయింపును రద్దు చేయాలని నిర్ణయించింది.

# రాష్ట్రంలో ఘోరమైన పరిస్థితులు : వైఎస్ జగన్

● సహానా కుటుంబాన్ని పరామర్శించిన జగన్ ● పార్టీ తరఫున సహానా ఫ్యామిలీని ఆదుకుంటామన్న మాజీ సీఎం ● ఆమె మృతికి కారణమైన నవీన్ టీడీపీకి చెందిన వాడన్న వైసీపీ అధినేత ● రాష్ట్రంలో శాంతి భద్రతలు దిగజారిపోయాయని వ్యాఖ్య ● ఆడవాళ్లకు రక్షణలేకుండా పోయిందని ఆవేదన



**గుంటూరు జిల్లా,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** గుంటూరు జిల్లా తెనాలికి చెందిన యువతి సహానా.. రౌడీషీటర్ నవీన్ దాడిలో తీవ్రంగా గాయపడి మృతిచెందిన విషయం తెలిసిందే. గుంటూరు జీజీహెచ్‌లో ఉన్న ఆమె మృతదేహాన్ని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ పరిశీలించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ తరఫున సహానా ఫ్యామిలీని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్రంలో ఇప్పటివరకు వివిధ ఘటనలలో చనిపోయిన ఆరుగురు ఆడపిల్లల కుటుంబాలకు వైసీపీ తరఫున రూ.10లక్షలు ఆర్థిక సాయం ఇస్తామన్నారు. అనంతరం జగన్ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో దారుణపరిస్థితులు ఉన్నాయని, రెడ్‌బుక్ పాలన సాగుతోందని విమర్శించారు. సహానా మృతదేహాన్ని పరిశీలించిన తనకు ఆమె శరీరంపై కమిలిన గాయాలు కనిపించాయన్నారు. ఆమెపై అఘాయిత్యానికి పాల్పడి, ఆసుపత్రిలో చేర్పించి వెళ్లిపోయారని ఆరోపించారు. ఆమె మృతికి కారణమైన నవీన్ టీడీపీకి చెందిన వాడని, అతను స్థానిక ఎంపీతో సన్నిహితంగా ఉండేవాడని ఆరోపించారు. సీఎం చంద్రబాబుతో కలిసి అతను దిగిన ఫొటోలు కూడా ఉన్నాయన్నారు. నిందితుడు తమ పార్టీకి చెందినవాడు కావడంతోనే టీడీపీ నిస్సిగ్గుగా అతడ్ని కాపాడాలని చూస్తోందని జగన్ దుయ్యబట్టారు. ఇంతవరకూ మృతురాలి కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే, హోంమంత్రి ఎవరూ పరామర్శించకపోవడం శోచనీయం అని జగన్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా మహిళలకు రక్షణ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎంతకు దిగజారిపోయాయో దళిత మహిళలను చూస్తే అర్థమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో మహిళలకు దిశయాప్ ద్వారా భద్రత కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా జగన్ గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఆడవాళ్లకు రక్షణ ఉండేదన్నారు. ఇదిలాఉంటే.. నిందితుడు నవీన్‌ను తెనాలి పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు. సహానా–నవీన్ మధ్య అప్పు విషయమై ఉన్న తగాదాలే ఆమె హత్యకు కారణమని పోలీసులు వెల్లడించారు. అలాగే టీడీపీతో నవీన్‌కు ఎలాంటి సంబంధం లేదని పోలీసులు తెలిపారు. ఇంత స్పష్టంగా పోలీసులు చెబుతున్నా.. వైసీపీ నాయకులు ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని టీడీపీ శ్రేణులు తీవ్రంగా ఖండిస్తున్నాయి.

# కాబోయే మంత్రి వంగవీటి ?



**విజయవాడ,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** వంగవీటి రంగా వారసుడు రాధాకృష్ణ కోసం మంత్రి పదవి వేచి ఉందా. రాధా దశ తిరుగుతోందా. వంగవీటి రంగా వారసుడు రాధాకృష్ణ కోసం మంత్రి పదవి వేచి ఉందా. రాధా దశ తిరుగుతోందా. రెండు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ తరువాత రాధాకు తగిన స్థానం లభిస్తోందా అంటే జరుగుతున్న పరిణామాలు అవును అనే చెబుతున్నాయిట. వంగవీటి రంగా వారసుడిగా రాధాకృష్ణ ఇప్పటికి రెండు దశాబ్దాల క్రితం అంటే 2004లో కాంగ్రెస్ లో చేరి విజయవాడ తూర్పు నుంచి ఎమ్మెల్యేగా తొలిసారి నెగ్గారు. ఆ తరువాత ఆయన ప్రజారాజ్యంలో చేరి 2009లో పోటీ చేసినా వైసీపీలో చేరి 2014లో బరిలోకి దిగినా మళ్ళీ గెలవలేకపోయారు. టీడీపీలోకి 2019 ఎన్నికల ముందు వచ్చిన రాధాకు అపుడూ 2024లోనూ కూడా టికెట్ దక్కలేదు. అయితే ఆయనకు నామినేటెడ్ పదవిని ప్రామిస్ గా ఇచ్చారు. ఆ మేరకు టీడీపీ అధినాయకత్వం నుంచే నేరుగా భరోసా దక్కింది. ఇక 2024 ఎన్నికల వేళ రాధా ఏపీలో అంతా పెద్ద ఎత్తున పర్యటించి వైసీపీకి వ్యతిరేకంగా గళం వినిపించారు. ఆయన తనదైన శైలిలో ఒక బలమైన సామాజిక వర్గం మద్దతుని టీడీపీకి కూడగట్టారు. ఇక టీడీపీ కూటమి ప్రభుత్వం ఏపీలో అధికారంలోకి వచ్చి అయిదవ నెల ప్రవేశించింది. రాధాకు పదవి అయితే దక్కలేదు. ఆయన అభిమానులు అయితే ఎంతో ఆశగా చూస్తున్నారు. ఇంతలో రాధాకు గత నెలలో అనారోగ్య సమస్యలు తలెత్తడంతో ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా రాధా ఇంటికి తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి అయిన నారా లోకేష్ వెళ్లారు. ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా రాధాకు ఆయన పార్టీ తరఫున ఒక కీలక హామీని ఇచ్చారని తెలుస్తోంది. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాధాకు ఎమ్మెల్యే కోటాలో ఒక సీటుని కేటాయిస్తామని స్పష్టం చేశారని ప్రచారం సాగుతోంది. ఇక ఉమ్మడి క్రిష్ణా జిల్లాలో చూసుకుంటే బలమైన సామాజిక వర్గానికి మంత్రి వర్గంలో చోటు దక్కలేదు. దాంతో పాటు ఏపీ కేబినెట్ లో ఒక పదవిని అలాగే ఖాళీగా ఉంచేశారు. దాంతో రాధాని ఎమ్మెల్సీగా చేసి ఆ పదవిని ఆయనకు కట్టబెడతారు అని అంటున్నారు. అదే కనుక జరిగితే రాధా పంట పండినట్లే అని అంటున్నారు. రంగా వారసుడిగా రాధా రానున్న కాలంలో మరింతగా దూకుడు చేయడానికి ఆయనకు మంత్రి పదవి ఎంతో ఉపయోగపడుతుందని అంటున్నారు. ఇక రాధాని మంత్రిని చేయడం ద్వారా కోస్తాలో బలమైన కాపు సామాజిక వర్గానికి మరింతగా చేరువ కావాలని అది జమిలి ఎన్నికల్లో టీడీపీకి మరోసారి ఉపయోగపడుతుందని కూడా అలోచిస్తున్నారు అని అంటున్నారు. మొత్తానికి రాధా కాబోయే మంత్రిగారు అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# ఒకటి రెండు రోజుల్లో పొలిటికల్ బాంబులు పేలనున్నాయి

● ప్రధాన నాయకులపైన చర్యలు తప్పవు ● ఆధారాలతో సిద్ధమైన ఫైళ్లు ● జాతీయ తెలుగు ఛానెల్ ఇంటర్వ్యూలో .. ● రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** దీపావళి రాకముందే రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజకీయ సంచలనాలు సృష్టించే పొలిటికల్ బాంబ్‌లను పేల్చేశారు. సియోల్‌లో హన్ నది పునరుజ్జీవన పరిస్థితులను అధ్యయనం చేయడానికి వెళ్లిన మంత్రి పొంగులేటి అక్కడ ఓ తెలుగు జాతీయ ఛానల్ ప్రతినిధికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్ట్, ధరణి వంటి సుమారు 8 నుంచి 10 ప్రధాన పాయింట్లలో ఈ చర్యలు ఉంటాయన్నారు. దీనికి సంబంధించి ఫైళ్లు పూర్తి సాక్ష్యాధారాలతో సిద్ధమయ్యాయని మంత్రి పొంగులేటి వివరించారు. సియోల్ నుంచి మరో 2 రోజుల్లో హైదరాబాద్ చేరేసరికల్లా చర్యలు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. కేవలం కక్ష సాధింపులా గాక పూర్తిగా ఆధారాలతో చర్యలు ఉంటాయని, ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదన్నారు. తొందరపడి ఎటువంటి ఆధారాలు లేకుండా వెళ్లబోమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి విచారణ దాదాపు పూర్తయిందని మొత్తానికి ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్ట్, ధరణి వంటి అంశాలు ట్రాక్‌లో ఉన్నాయని మంత్రి పొంగులేటి చెప్పారు. ప్రజలు ఇంతవరకు ఎటువంటి చర్యలు లేవని భావించవద్దని, వారు కోరుకునే విధంగా పూర్తి ఆధారాలతో ముఖ్యంగా ఫైళ్లు సాయంతో ముందుకు వెళ్లబోతున్నామని సంచలనాలకు మంత్రి తెరతీశారు.

# పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా అగ్రరాజ్యానికి యువగళం రథసారధి!

● 25నుంచి రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్ అమెరికా పర్యటన
● కీలకమైన ఐటి, ఎలక్ట్రానిక్స్ కంపెనీల ప్రతినిధులతో భేటీ కానున్న మంత్రి లోకేష్



**అమరావతి,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** అయిదేళ్లపాటు పడకేసిన పారిశ్రామికరంగాన్ని తిరిగి గాడిలో పెట్టి పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఈనెల 25వ తేదీనుంచి వారంరోజులపాటు అమెరికాలో పర్యటించనున్నారు. పెట్టుబడుల ఆకర్షణ ద్వారా పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించి రాష్ట్రంలోని కోట్లాదిమంది యువత ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చడమే ఈ పర్యటన ముఖ్యోద్దేశం. ఇందులో భాగంగా ఈనెల 29 న లాస్ వేగాస్ లోని సీజర్స్ ప్యాలెస్ లో ఐటి సర్వ్ అలయెన్స్ సంస్థ “సినర్జీ” పేరుతో నిర్వహించే కీలకమైన వార్షిక సమావేశానికి మంత్రి లోకేష్ విశిష్ట అతిథిగా హాజరుకానున్నారు. ఈ సమావేశానికి ఐటి సేవల పరిశ్రమ నుండి 3వేల చిన్న & మధ్య తరహా పారిశ్రామికవేత్తలు హాజరుకానున్నారు. సినర్జీ 2024 అనేది ముఖ్యంగా ఐటీలో ప్రభావవంతమైన పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, కీలక వాటాదారులను ఒకచోట చేర్చడానికి రూపొందించిన ఒక ప్రధాన సదస్సు. యుఎస్ మాజీ ప్రెసిడెంట్లు జార్జ్ డబ్ల్యూ బుష్, బిల్ క్లింటన్, సెక్రటరీ హిల్లరీ క్లింటన్, స్టీవ్ ఫోర్బ్స్, కెవిన్ ఓ లియరీ, షీలా బెయిర్ , జాక్ కాస్ (ఓపెన్ ఏ 1) వంటి గౌరవనీయమైన స్పీకర్లను సినర్జీ హోస్ట్ చేస్తుంది. ఎపి ఐటి, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల మంత్రిగా పాలనలో సాంకేతికను జోడించి డిజిటల్ విధానాలను అమలు చేస్తున్న మంత్రి లోకేష్ ను విశిష్ట అతిథిగా ఆహ్వానిస్తున్నట్లు సినర్జీ తెలిపింది. ఆంధ్రప్రదేశ్ రాజకీయ, సాంకేతిక రంగాల్లో కీలక వ్యక్తిగా, డిజిటల్ ఆవిష్కరణలను ప్రోత్సహించడం, స్టార్ట్-అప్‌లకు మద్దతు ఇవ్వడంలో మీ చొరవ ఆర్థికాభివృద్ధిలో ఒక బెంచ్‌మార్క్‌ను ఆవిష్కరించిందని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. పాలనలో సాంకేతికత పాత్ర, యువత, వ్యవస్థాపకుల సాధికారతపై సినర్జీ సమావేశంలో మీరిచ్చే విలువైన సందేశం ఔత్సాహితులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఐటి సర్వ్ అలయెన్స్ సంస్థ మంత్రి లోకేష్ కు పంపిన ఆహ్వానపత్రంలో పేర్కొంది.

# వైసీపీకి వాసిరెడ్డి పద్మ రాజీనామా..



**గుంటూరు,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** వైకాపాకు మరో షాక్ తగిలింది. ఆ పార్టీ మహిళా నేత, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ రాజీనామా చేశారు. గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు ఆమె దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో వైకాపాను ఆమె వీడారు. రాజీనామా లేఖను వైకాపా కార్యాలయానికి వాసిరెడ్డి పద్మ పంపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైకాపా అధ్యక్షుడు జగన్‌పై తీవ్ర విమర్శలు చేశారు.

**‘గుడ్ బుక్’ పేరుతో మరోసారి జగన్ మోసం..** “వైకాపా పాలనలో మాజీ సీఎం జగన్ ప్రజలను అన్నివిధాలుగా మోసం చేశారు. ప్రభుత్వ మద్యం పేరిట పేద ప్రజలను దోచుకున్నారు. ఐదేళ్ల పాలనలో ఎప్పుడూ ప్రజా సమస్యలను పట్టించుకోలేదు. వైకాపాలో మహిళలకు ఎలాంటి ప్రాధాన్యత లేదు. ఎన్నో అవమానాలు ఎదురైనా క్రమశిక్షణ కలిగిన నేతగా పార్టీ కోసం పనిచేశాను. మహిళలపై జరుగుతున్న దాడులను వైకాపా రాజకీయంగా వాడుకోవడం బాధాకరం. గత ప్రభుత్వం హయాంలోనూ అనేక దాడులు జరిగాయి. సీఎం హోదాలో జగన్ ఎప్పుడూ బాధితులను పరామర్శించలేదు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, దాడులను ఆయన దృష్టికి తీసుకెళ్లినా కనీస చర్యలు తీసుకోలేదు. పార్టీని నడిపించడంలో, పాలనలో జగన్‌కు బాధ్యత లేదు. నియంతృత్వ ధోరణిని ప్రజలు మెచ్చుకోరని ఎన్నికల తీర్పు స్పష్టం చేసింది. జగన్ ‘గుడ్ బుక్’ పేరుతో మరోసారి మోసానికి సిద్ధమయ్యారు. నాయకులు, కార్యకర్తల కోసం ఉండాల్సింది ‘గుడ్ బుక్’ కాదు ‘గుండె బుక్” అని వాసిరెడ్డి పద్మ పేర్కొన్నారు.

# ఎపిపిఎస్‌సి ఛైర్‌పర్సన్‌గా అనూరాధ

● ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ నీరభ్ కుమార్ ప్రసాద్
● గతంలో ఇంటెలిజెన్స్ చీఫ్, హోంశాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించిన అనురాధ
● గౌతమ్ సవాంగ్ రాజీనామా తర్వాత ఖాళీగా ఉన్న ఏపీపీఎస్సీ ఛైర్మన్ పదవి

**అమరావతి,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) ఛైర్‌పర్సన్‌గా రిటైర్డు ఐపిఎస్ అధికారి ఎఆర్ అనూరాధను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో ఎపిపిఎస్‌సి ఛైర్మన్‌గా నియమితులైన గౌతం సవాంగ్ ఈ ఏడాది జులై నాలుగున రాజీనామా చేశారు. అప్పటి నుండి ఛైర్మన్ పోస్టు ఖాళీగా ఉంది. ఈ పోస్టులో అనూరాధను నియమించారు. 1987 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన అనూరాధ డిజి విజిలెన్స్‌గా బాధ్యతలు నిర్వహించారు. సమర్థవంతమైన అధికారిగా అనూరాధకు పేరుంది. ఆమె భర్త సురేంద్రబాబు కూడా డిజి స్థాయిలో బాధ్యతలు నిర్వహించారు.



# త్వరలో చేనేత సహకార సంఘ ఎన్నికలు

● రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ● ఎన్నికల హామీల అమలుకు కట్టుబడిన ఉన్న సీఎం చంద్రబాబు ● ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించండి ● సమీక్షలో మంత్రి సవిత ఆదేశం



**అమరావతి,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** త్వరలో చేనేత సహకార సంఘ ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. దీనిలో భాగంగా నూతన సహకార సంఘాలను ఏర్పాటు చేయడంతో పాటు నిద్రాణస్థితిలో ఉన్న సంఘాలను బలోపేతం చేయాలని మంత్రి ఆదేశించారు. మంగళగిరిలోని హ్యాండ్లూమ్, టెక్స్ టైల్స్ కమిషనరేట్ లో వివిధ జిల్లాలకు చెందిన డీడీలు, ఏడీలతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, చేనేత కార్మికుల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు ప్రణాళికలు అమలు చేస్తున్నారన్నారు. గత ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా కృషి చేస్తున్నారన్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ మినహాయింపునకు చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. చేనేతలకు ప్రస్తుత ట్రెండ్ తగ్గట్లు శిక్షణ అందజేసి, తయ్యారైన వస్త్రాలకు మార్కెంట్ సదుపాయం కూడా కల్పించనున్నామన్నారు. చేనేతకు క్యాష్ లెస్ వైద్యమందించేలా బీమా సదుపాయం కల్పించనున్నామన్నారు. మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వనున్నామన్నారు. నూలుపై 15 శాతం సబ్సిడీ కూడా అందజేయనున్నాన్నారు. ఇవే కాకుండా 2014–19 మధ్య అమలు చేసిన అన్ని పథకాలనూ చేనేతలకు అందివ్వనునట్లు మంత్రి వెల్లడించారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ముద్ర రుణాలపై చేనేత కార్మికులకు వ్యక్తిగత, సామూహిక రుణాలివ్వాలన్నారు. తెలియజేయాలన్నారు. ప్రస్తుతమున్న టెక్స్ టైల్స్ పార్కులను అభివృద్ధి చేయడంతో పాటు చీరాలలో నూతన టెక్స్ టైల్ పార్కు ఏర్పాటుచేయనున్నామన్నారు. రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి చంద్రబాబు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పాటు పథకాలపై చేనేతలకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం అన్ని జిల్లాల్లోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

**నూతన సహకార సంఘాలను ఏర్పాటు చేయండి..** రాష్ట్రంలో నూతన సహకార సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత ఆదేశించారు. అదే సమయంలో నిద్రాణస్థితిలో ఉన్న సంఘాలను బలోపేతం చేయాలన్నారు. త్వరలో చేనేత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నామని, ఈ నేపథ్యంలో సంఘాలను బలోపేతం చేయాలని చేయాలని స్పష్టంచేశారు.

**వార్తాప్రభ - పంచాంగం**

**24-10-2024 గురువారం**

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం,
వర్షఋతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం.
ఆషాఢమాసం, శుక్లపక్షం

తిథి : అష్టమి 01:59 వరకు
నక్షత్రం : పునర్వసు 06:15 వరకు
వర్జ్యం : 07:39 నుండి 09:06 వరకు
దుర్ముహూర్తం : 09:52 నుండి 10:38 వరకు
రాహుకాలం : 01:27 నుండి 02:54 వరకు
మంచి సమయం : 00:53, అక్టోబరు 25 నుండి 02:35, అక్టోబర్ 25 వరకు
సూర్యోదయం : 5:57 కి
సూర్యాస్తమయం : 5:39 కి

# అంతర్జాతీయ ఓపెన్ చెస్ విజేతను అభినందించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి

● రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రిని కలిసిన అంతర్జాతీయ ఓపెన్ చెస్ విజేత.



**విజయవాడ,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** థాయిలాండ్ లో ఈనెల జరిగిన పట్టాయ శ్రీరాచా ఓపెన్ చెస్ చాంపియన్షిప్ షిప్- 2024 ను, విజయవాడకు చెందిన గ్రాండ్ మాస్టర్ ముసునూరి రోహిత్ లలిత్ బాబ విన్నర్ ట్రోఫీ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విజయ వాడ క్యాంపు కార్యాలయంలో క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. లలితను మంత్రి అభినందించి ప్రోత్సహించారు.

# సంక్షేమ పథకాలకు చిరునామా కృష్ణ మిల్క్ యూనియన్

● పాల కేంద్రాల సందర్శనలో చైర్మన్ చలసాని



**పెడన,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** పాల రైతులకు సంక్షేమ పథకాలను అందించే విషయంలో కృష్ణ మిల్క్ యూనియన్ ముందు ఉందని ఆ యూనియన్ జిల్లా చైర్మన్ చలసాని ఆంజనేయులు చెప్పారు. అయన బుధవారం చిట్టి పాలెం గంటల మ్మపాలెం పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘాలను సందర్శించారు. ఈ సందర్భ ంగా ఆంజనేయులు మాట్లాడుతూ యూనియన్ పాడి రైతులకు అందించే ధర వ్యత్యాసం కళ్యాణ మస్తు క్షీరభంధు ప్రతిభా ఆక్సిడెంట్ కేర్ ట్రస్ట్ పథకాల గురించి పాడి పశువులకు అందించే పశు భీమా డీ వార్మింగ్ పశు దాణా కాల్షియం మినరల్ మిక్సర్ వాడటం వలన కలిగే ప్రయోజనాలను పాడి రైతులకు తెలియజేశారు. యూనియన్ వారు అందించే సెమెన్ ద్వారా పుట్టిన దూడలు భవిష్యత్ లో ఎక్కువ పాల చార గలిగిన పశువులు గా రైతులకి అధిక లాభాలు ఆర్జించగలవని తెలిపారు. ఈ కార్యక్రమం లో కృష్ణా మిల్క్ యూనియన్ పాలక వర్గ సభ్యులు పెడన జెడ్పిటిసి అర్జా వెంకట్ నగేష్ వెటర్నరీ ఆఫీసర్ డా. లింగం ప్రసాద్ గుడ్లవల్లేరు పాల శీతల కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ సంఘ అధ్యక్షులు చండిక నాగబాబు చండిక విజయలక్ష్మి సూపర్ వైజర్ పెయ్యేటి బసవరాజు కుమార్ సంఘ పాలక వర్గ సభ్యులు పాల ఉత్పత్తి దారులు పాల్గొన్నారు.

# మానవ హక్కుల సాధన పై శ్రీ వాసవిలో అవగాహన సదస్సు



**పెడన,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** హక్కులను సాధించే విషయంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మానవ హక్కుల వేదిక ఫౌండర్ డాక్టర్ దొండపాటి దాసు అన్నారు. పెడన మండలం నందమూరు లోని శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నాడు మానవ హక్కుల పై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సమాచార హక్కు బాల్యవివాహాల నిర్మూలన చట్టం మానవ అక్రమ రవాణా చట్టం మహిళలపై వేధింపులు బాల కార్మిక నిర్మూలన చట్టం ఫోక్స్ చట్టం తదితర అంశాలపై వక్తలు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవాడ ప్రశాంతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఆర్.ఎస్ రెడ్డి కోఆర్డినేటర్ ఎస్ అనిల్ వివిధ విభాగాధిపతులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదిత్య డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మోల్ దినోత్సవం



**కాకినాడ,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** ఆదిత్య డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మోల్ దినోత్సవం నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మోల్ దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ నాయుడు మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థులు నూతన అంశాలను తెలుసుకోవాలని, పరిశోధన రంగంలో ఉత్తమ స్థితిని పొందాలని అన్నారు. ఈ రంగంలో ఉన్న ఉద్యోగ అవకాశాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన సీనియర్ రసాయన శాస్త్ర ఉపన్యాసకులు ఈవీఎస్ సుబ్రహ్మణ్యం ప్రోటాన్ ఐస్కాంత అనునాదం అనువర్తనాలను విద్యార్థులకు వివరించారు. ప్రయోగశాలలో విద్యార్థులు నేర్చుకోవాల్సిన అంశాలను, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ఆర్టికల్ ప్రిపరేషన్,ప్రాజెక్టు ప్రజెంటేషన్ పోటీలలో విజేతలకు ప్రశంసా పత్రాలు,జ్ఞాపికలను ముఖ్య అతిధుల చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన కెమిస్ట్రీ విభాగాన్ని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ,పీజీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్చార్జి మూర్తి, కెమిస్ట్రీ విభాగాధిపతి కె.సురేష్ కుమార్,అధ్యాపకులు వి సోమేశ్వరరావు, కె.నాగు,కె.వీరబాబు , బి.దివ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతలపై సి ఐ సత్యనారాయణ సమీక్ష



**కాకినాడ,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** త్రీ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలపై మహిళా పోలీసు సిబ్బందితో సి ఐ కె వి ఎస్ .సత్యనారాయణ సమీక్ష నిర్వహించారు. సినిమా రోడ్డులో స్టేషన్ ఆవంణలో నిర్వహించిన సమీక్షకు పలువురు మహిళా పోలీసు సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా సి ఐ సత్యనారాయణ మాట్లాడుతూ రాబోయే దీపావళి పండుగా దృష్ట్యా అక్రమ బాణా సంచా నిల్వలు ఉంటే తక్షణం సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా గంజాయి అమ్మకాలు, శాంతి భద్రతలు కు విఘాతం కలిగించే అంశాలు ఏమైనా ఉంటే సమాచారం ఇవ్వాలని చెప్పారు. బహుళ అంతస్తుల్లో తప్పని సరిగా సీ సీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని అన్నారు. ప్రతి వారం ఆయా అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో సాంబమూర్తి నగర్, రాగం పేట,పల్లం రాజు నగర్,సూర్యనారాయణ పురం తదితర ప్రాంతాలకు చెందిన మహిళా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అందరినీ అలరించే చిత్రం "క"



**కాకినాడ,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** " క " అనే సినిమా అన్ని వర్గాల వారిని అలరిస్తుందని వర్ధమాన నటుడు కిరణ్ అబ్బవరం అన్నారు. సినిమా ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం కాకినాడ వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ " క " అనే సినిమా వినోద భరితంగా ప్రేక్షకులను ప్రత్యేకంగా ఆహ్లాదపరుస్తుందన్నారు." క " అనే టైటిల్ కు అర్ధం చివరిలో తెలుస్తుందన్నారు. అన్ని భాషలలో వస్తుందని తెలుగులో మాత్రం తాను డబ్బింగ్ చెప్పానన్నారు. ఈనెల 31న దీపావళి పండుగ సందర్భంగా థియేటర్లలో విడుదల అవుతుందన్నారు. కె ఎ ప్రొడక్షన్స్ లో వచ్చే ఈ సినిమా కు రచయిత, దర్శకుడు సుజిత్ & సందీప్, నిర్మాత చింతా గోపాలకృష్ణ రెడ్డి వ్యవహరిస్తున్నారని తెలిపారు. పలువురు అభిమానులు ఆయనతో సెల్ఫీలు తీసుకున్నారు.

# పెడన కాంగ్రెస్ ఇన్చార్జిగా సుధాకర్ రావును ఎంపిక చేయండి

● జిల్లా నాయకులకు సూచించిన స్థానిక నాయకులు



**పెడన,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా లింగాల సుధాకర్ రావును నియమించాలని స్థానిక నాయకులు జిల్లా నాయకులు కోరారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లు కృష్ణ డిసిసి ఇన్చార్జి మార్పిడి బాబ్జి మొవ్వ మోహనరావు లు బుధవారం నాడు పట్టణంలోని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆకురాతి జనార్ధన్ నివాసానికి వచ్చారు. సందర్భంగా స్థానిక నాయకులు వారిని కలిసి గతంలో ఇన్చార్జిగా పనిచేసిన లింగాలనే మరోసారి నియమించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేసిన శొంఠి నాగరాజు స్థానికేతరుడు కావడంతో అతనికి ఈ పదవి ఇవ్వద్దని వీరు చెప్పారు. ఎంపీ అభ్యర్థికి 11వేల ఓట్లు రాగా ఎమ్మెల్యేగా పోటీ చేసిన నాగరాజుకు కేవలం 16 వందలఓట్లు మాత్రమే వచ్చిన విషయాన్ని మీరు గుర్తు చేశారు. ఎన్నికల సమయం ఆ తర్వాత కూడా నాగరాజుతో వీరికి పొసగడం లేదు. ఇప్పటివరకు సమన్వయ లోపంతోనే నెట్టుకొచ్చారు. నాగరాజుకు ఇన్చార్జి ఇస్తే తాము పార్టీలోనే ఉండబోమని నాయకులకు తెగేసి చెప్పారు. ఈనెల 20వ తేదీన విజయవాడ ఆంధ్ర రత్న భవన్ లో పెడన నాయకులతో అధిష్టానం సమీక్ష సమావేశం ఏర్పాటు చేసింది. తమ అభిప్రాయాలను ఆరోజు కూడా అధిష్టానం దృష్టికి తీసుకువెళతామని పట్టణ కాంగ్రెస్ ఇంచార్జి సి హెచ్ వి అప్పారావు తెలిపారు. పెడన పరిస్థితిని పిసిసి దృష్టికి తీసుకెళ్తామని జిల్లా నాయకులు చెప్పారు. డిసిసి నాయకులను కలిసిన వారిలో లింగాల సుధాకర్ రావు జన్యావుల లీలాకృష్ణ రాగిరమేష్ మండల పార్టీ అధ్యక్షులు ఉన్నారు

# జిల్లా ఎస్ పి రెడ్డి గంగాధరరావు ను సన్మానించిన తెలుగు దేశం పార్టీ నాయకులు



**హనుమాన్ జంక్షన్,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా ఎస్ పి రెడ్డి గంగాధరరావు బుధవారం బాపులపాడు మండలంలోని వీరవల్లి పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మండలం లోని వివిధ గ్రామాల నుంచి తెలుగు దేశం పార్టీ నాయకులు వచ్చి మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్చాలు అందించారు. శాలువాలతో సన్మానించారు. వీరవల్లి గ్రామ ప్రముఖులు, తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు లంక బాబు సురేంద్ర మోహన్ బెనర్జీ బొకే అందించి శాలువాతో సన్మానించారు. అలాగే తెలుగు దేశం పార్టీ నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, గుండపనేని ఉమా ప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, లంక అజై , అమృతపల్లి సూర్యనారాయణ , వేగిరెడ్డి పాపారావు, చింతల వెంకట శివ అప్పారావు, వేగిరెడ్డి బాలాజీ, మందాడి రవీంద్ర, ఆర్నేపల్లి సూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

# వీరవల్లి పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్ పి రెడ్డి గంగాధరరావు



**హనుమాన్ జంక్షన్,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్ లో ట్రాఫిక్ ను నియంత్రించేందుకు సిబ్బందిని నియమిస్తామని కృష్ణా జిల్లా ఎస్ పి రెడ్డి గంగాధరరావు అన్నారు. బుదవారం బాపులపాడు మండలం వీరవల్లి పోలీస్ స్టేషన్ ను తనిఖీ నిమిత్తం వచ్చారు. ఈ సందర్భంగా విలేఖరులు పై విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే ఆయన స్పందించారు. అలాగే హనుమాన్ జంక్షన్ లో అధునాతనంగా దాతల విరాళాలతో నిర్మించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని త్వరలోనే అధికారికంగా ప్రారంభిస్తామని చెప్పారు. హనుమాన్ జంక్షన్. విజయవాడ మధ్య జాతీయ రహదారి ఎక్కువగా ఉండటంతో అపివేసిన హైవే మొబైల్ వ్యవస్థను పునరుద్ధరిస్తామని అన్నారు. నేరాలను అరికట్టేందుకు సి. సి కెమెరాలకు ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు త్యాగాలు చేశారని విధి నిర్వహణలో వారి మరణం వీర మరణమని అన్నారు. వారిని స్మరించుకోవలసిన బాధ్యత మనపై ఉందని ఎస్ పి గంగాధరరావు అన్నారు. ఈ సందర్భంగా వారికి జోహార్లు అర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్ లో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ జంక్షన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె వి వి ఎన్ సత్యన్నారాయణ , వీరవల్లి ఎస్ ఐ మైనం శ్రీనివాస్ , సచివాలయ మహిళా పోలీసులు, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని తెలుగు దేశం పార్టీ నాయకులు పలువురు వచ్చి ఎస్ పి గంగాధరరావు ను కలసి పుష్ప గుచ్చాలు అందించారు.

# పిల్లల ఆరోగ్యం దేశ వికాసానికి సౌభాగ్యం - వైద్యాధికారి ఆల్తాఫ్ హుస్సేన్



**కృత్తివెన్ను,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాల బాలికల కు వారి భవిష్యత్తు ఆరోగ్య ప్రణాళికలో భాగంగా మండలంలో గల చిన్న గొల్ల పాలెం పంచాయితీ పరిధిలోని ఏటి మొండి పల్లిపాలెం ప్రభుత్వ పాఠశాలలో చదివే చిన్నారులకు వైద్య అధికారి డాక్టర్ ఆల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో హెల్త్ కార్డులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టుకతో పిల్లల్లో వచ్చే లోపాలను మరియు చిన్న తనంలో వచ్చే సాధారణ వ్యాధులను సకాలంలో గుర్తించి సరైన వైద్యం అందించేందుకు ఈ హెల్త్ కార్డులు ఎంతో ఉపయోగపడతాయని తద్వారా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సహాయం సకాలంలో అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య అధికారి ఆల్తాఫ్ హుస్సేన్ తో పాటు సిబ్బంది... రాజేంద్రప్రసాద్ కే మరియమ్మ కే స్వరూపారాణి మరియు ఉపాధ్యాయులు.. ఉండి పురుషోత్తం కే బాల ఆశా వర్కర్లు అంగన్వాడీ టీచర్... కే సూర్య కుమారి పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# జింజేరు గౌడపాలెంలో బీజేపీలో చేరికలు



**పెడన,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా పెడన మండలం పెద్ద జింజేరు గౌడపాలెం లో బుధవారం నాడు పలువురు బిజెపిలో చేరారు. గ్రామంలో బిజెపి ఓబీసీ మోర్చా నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు కొత్తగా చేరిన వారికి సభ్యత్వాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా జోనల్ ఇన్చార్జి వీర్ల కృష్ణ జిల్లా అధ్యక్షులు పోలన అశోక్ జిల్లా ఉపాధ్యక్షులు లంకపల్లి మల్లేష్ జోగి రవీంద్ర జిల్లా కార్యదర్శి మురాల వెంకటేశ్వరరావు జిల్లా కార్యవర్గ సభ్యులు కుక్కల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# బాణాసంచా విక్రయాల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి



**అమలాపురం,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** బాణాసంచా విక్రయాల్లో భద్రత ప్రమాణాలు పాటించక పోతే చర్యలు తప్పవని స్థానిక రెవిన్యూ డివిజ నల్ అధికారిని కె.మా ధవి సంబంధిత అధికా రులకు విక్రయదారులకు స్పష్టం చేశారు. దీపావళి పండుగ నేపథ్యంలో భద్రత అంశంపై రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, కార్మిక శాఖల అధికారులతో ఆర్డీవో కె.మాధవి తమ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీపావళి బాణాసంచా తయారీ దారులు, విక్రయదారులు సురక్షితమైన వాతావరణంలో పండుగ జరుపుకునేందుకు అన్ని ప్రామాణిక భద్రతా చర్యలను పటిష్టంగా పాటించాలని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ముఖ్యంగా దీపావళి బాణాసంచా తయారీ కేంద్రాల్లో వృద్ధు లు, మహిళలు,బాలలతో పనిచేయించకూడదని శిక్షణ పొందిన కార్మికుల ను మాత్రమే నియమిం చుకోవాలని తెలిపారు. ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరుగకుండా అన్ని జాగ్రత్తలు ఖచ్చితంగా పాటించాలని ఆదేశిస్తూ, ఇసుక, నీరు, అగ్నిమాపక పరికరాలు విధిగా అందు బాటులో ఉంచాలని ఆమె సూచించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా భద్రతా ఏర్పాట్లు పటిష్టం గావిం చాలని అధికారులను ఆదేశించారు. బాణాసం చా విక్రయాలను అనుమతించిన ప్రదేశాలలో, నిర్దేశించిన సమయంలో మాత్రమే విక్రయాలు పూర్తి లైసెన్సులు అనుమతులు పొంది జరుపుకోవాల్సిన ఉంటుందన్నారు. మండల స్థాయిలో తహశీల్దారు,పోలీసు అధికారులు విస్తృత స్థాయి తనిఖీలు చేప ట్టాలని, నిబంధనలను అతిక్రమించి బాణాసంచా తయారీ, విక్రయాలకు పాల్పడే వారిపై చర్యలు చేపట్టాలని ఆర్డీవో కె.మా ధవి తహశీల్దార్లను ఆదేశించారు. తయారీ, విక్రయ కేంద్రాలలో నిర్దేశించిన పరిమాణంలో మాత్రమే బాణాసంచా నిల్వలు ఉండాలని, అక్రమ తయారీకి, నిల్వలకు పాల్పడే వారిపై క్రిమినల్ చర్యలు తప్ప వని హెచ్చరించారు. ఇటువంటి చర్యలకు పాల్పడే వారి సమాచా రం ఉంటే వెంటనే పోలీస్ రెవెన్యూ సిబ్బందికి తెలి యపరచాలని ఆమె ప్రజలను కోరారు. ఈ సమావేశం లో జిల్లా అగ్నిమాపక అధికారి ప్రసాద్, అమలాపురం డివిజన్ తహసీల్దారులు, పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్ట ర్లు, సబ్ ఇన్స్పె క్టర్లు, బాణా సంచా తయారీ దారులు, బాణాసంచా విక్రయదారులు తదితరులు పాల్గొన్నారు.

# 22 లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**నందిగామ,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** పేద ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని స్థానిక శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య అన్నారు. బుధవారం నాడు స్థానిక శాసనసభ్యులు కార్యాలయంలో 22 బాధ్యత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా విడుదలైన 13 లక్షల రూపాయల చెక్కులను ఎంఎల్ఏ సౌమ్య లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చందర్లపాడు మాజీ జడ్పిటిసి సభ్యులు వాసిరెడ్డి ప్రసాద్, భారతీయ జనతా పార్టీ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య, పట్టణ అధ్యక్షులు ఏచూరు రాము, కౌన్సిలర్ అమరయ్య, కత్తు రోజు శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు,విద్యార్థుల స్వీయ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది : ఎమ్మెల్యే వనమాడి కొండబాబు





**కాకినాడ,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** క్రీడలు విద్యార్థులలో స్వీయ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండ బాబు పేర్కొన్నారు. కాకినాడ జగన్నాథ పురం అన్నవరం సత్యదేవ ఉమెన్స్ కాలేజీ లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని టైక్వాండ మెన్ అండ్ ఉమెన్ ఇంటర్ కాలేజీ పోటీలను ఎమ్మెల్యే కొండ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడలో జాతి స్థాయి క్రీడాకారులు ఉన్నారని, క్రీడలో రాణించి స్పోర్ట్స్ కోటా ద్వారా అనేక ఉన్నతమైన లక్ష్యాలను సాధించి స్థిరపడ్డారని, గతంలో టైక్వాండ క్రీడాకారులకు స్పోర్ట్స్ కోట ఉండేది కాదని క్రీడాకారులందరు కోరడంతో టైక్వాండని స్పోర్ట్స్ కోటలో పెట్టాలని కోరడం జరిగిందని ఇప్పుడు టైక్వాండకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కేటాయించడం జరుగుతుందని, సుమారు రూ. 66 కోట్ల రూపాయలతో కాకినాడ జగన్నాధపురం లోని నూతనంగా స్టేడియంలో నిర్మాణం చేపట్టడం జరుగుతుందని చాలామంది శరీర దృఢంగా ఉన్నవారికి కరోనా దగ్గరికి రాలేదని, దృఢంగా లేనివారు కరోనా బారిన పడి మరణించారని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాయామం చేయాలని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ వి. అనంతలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ ఎం. సువర్చల, ఆదికవి నన్నయ యూనివర్సిటీ అబ్జర్వర్ వర్మ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ వసంత లక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ పరిమళారాణి , కోచ్ లక్ష్మణ్, చింత సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# కమ్మవారి ఐక్య సేవా సమితి ఆంధ్ర ప్రదేశ్ సహకారంతో ఉచిత కంటి ఆపరేషన్లు



**హనుమాన్ జంక్షన్,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం రంగయ్య అప్పారావుపేట గ్రామంలో ఈనెల 17 తారీకు ఉచిత నేత్ర త్ర వైద్య శిబిరంలో వందమందికి కంటి పరీక్షలు చేయగా 23 మందికి కంటి ఆపరేషన్ చేయవలసి వచ్చింది. నేడు విజయవాడ శంకర గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ అండ్ రీసెర్చ్ సెంటర్ లో 17 మందికి సమితి సహకారంతో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయడం జరిగిందని. మరో 30 మందికి తక్కువ రేట్లకు కళ్ళజోళ్ళు అందజేసినట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పరుచూరి రామకృష్ణ తెలియజేశారు. ఈ సందర్భంగా పరుచూరి రామకృష్ణ మాట్లాడుతూ నవంబర్ రెండవ వారంలో రంగయ్యప్పారావుపేట గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం, నవంబర్ మూడో వారంలో హనుమాన్ జంక్షన్ లో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శంకర గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ అండ్ రీసెర్చ్ సెంటర్ పి ఆర్ ఓ మురళి, అనిల్, సమితి సహాయ కార్యదర్శి పొట్లూరి శ్రీ సత్య ఫణింద్ర కుమార్, కార్యవర్గ సభ్యులు పరుచూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# టిడ్కో చైర్మన్ ను కలిసిన ఎమ్మెల్యే పంతం నానాజీ



**కాకినాడ రూరల్,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** రాష్ట్ర టిడ్కో చైర్మన్ గా నూతనంగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించిన జనసేన పార్టీ నాయకులు వేములపాటి అజయ్ కుమార్ ని, కాకినాడ రూరల్ నియోజకవర్గ శాసన సభ్యులు పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) విజయవాడ ఆంధ్ర ప్రదేశ్ టిడ్కో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది.

# ప్రమాదరహిత సింగరేణిగా తీర్చిదిద్దుదాం!!

- అంకితభావం, సమిష్టి కృషితో కంపెనీ పురోగతి
- ప్రతి ఎంప్లాయ్ మదిలో మన సంస్థ, మన గని, మన బాధ్యత అనే అంశాలు నిలవాలి
- సింగరేణి ఆర్జీవన్ జీఎం డి.లలిత్ కుమార్



**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)**ప్రమాదరహిత సింగరేణిగా తీర్చుదిద్దడం కోసం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, సింగరేణి సి.ఎం.డి బలరాం నాయక్ సమావేశాలను తరచు నిర్వహిస్తూ విశిష్ట కృషి చేస్తున్నారని అన్నారు సింగరేణి ఆర్జీవన్ జీఎం డి.లలిత్ కుమార్. ఈ మేరకు బుధవారం జీడికే లెవెన్ ఇంక్లెయిన్ గనిలో మల్టీ డిపార్ట్మెంటల్ మీటింగ్ నిర్వహించారు. సమావేశంలో జిఎం మాట్లాడుతూ.... అంకితభావం, సమిష్టి కృషితో కంపెనీ పురోగతి సాధించి ఉత్పత్తి ఉత్పాదకత రంగంలో అగ్రగామిగా నిలుస్తుంది అని తెలిపారు. ప్రతి ఒక్కరూ కూడా రక్షణ సూత్రాలను పాటిస్తూ నిర్దేశిత ప్రొడక్షన్ కొరకు పాటుపడాలని అన్నారు. కంపెనీ సోషల్ రెస్పాన్సుబిలిటీ కింద చేపట్టిన కార్యక్రమాలు, చేపట్టబోయే కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రతి కార్మికుని, ఉద్యోగి మదిలో సింగరేణి మన సంస్థ, మన గని, మన బాధ్యత అనే అంశాలు ఉండాలి అని సూచించారు.

## పాఠశాలకు టేబుల్,కుర్చీల భావకరణ



**వలిగొండ అక్టోబర్ 24 (వార్తాప్రభ ప్రతినిధి):**ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి లో సమాజ సేవకుల పాత్ర అందరిది ఉండాలనే మంచి ఆలోచనతో స్థానికలను సంప్రదించే క్రమంలో పాఠశాల తరగతి గదులకు,ఆఫీస్ కి కొన్ని కుర్చీలు,టేబుల్స్ కావాలి అని అడిగిన వెంటనే స్పందించి ముందుకు వచ్చి బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆలకుంట శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వలిగొండ పట్టణ ప్రముఖులు కొండూరు భాస్కర్ పాల్గొని 25 వేల రూపాయల విలువ గల కుర్చీలు,టేబుల్స్ పాఠశాల కు అందించడం జరిగింది. పాఠశాల అభివృద్ధి కి చేయూతనందించిన దాత కి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధన్యవాదములు తెలియజేశారు.ఇలాగే పుర ప్రముఖులు ఇంకా కొంతమంది ముందుకు వచ్చి వలిగొండ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి లో భాగస్వాములు కావాలని తెలియజేశారు.ఇట్టి కార్యక్రమం లో నాయకులు కాసుల వెంకన్న,మైసోళ్ల మత్స్యగిరి ,కొండూరు సాయి మరియు పాఠశాల ఉపాధ్యాయులు మునగపాటి వరమ్మ,మామిడి కవిత మొదలగు వారు పాల్గొన్నారు.

## నిరుపేద మహిళకు ఆర్థిక సహాయం!!

కుటుంబానికి ఎల్లవేళలా తోడుగా నిలుస్తాం
మగువ లయన్స్ క్లబ్ లయన్ సోమారపు లావణ్య



**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం ప్రాంతానికి చెందిన నిరుపేద మహిళ సుమతికి 8000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు మగువ లయన్స్ క్లబ్ లయన్ సోమారపు లావణ్య. నిరుపేద మహిళ కుటుంబ పరిస్థితి తెలుసుకుని ఆర్థిక సహాయం అందించి ఆ కుటుంబానికి ఎప్పుడు ఆపద వచ్చినంక తోడుగా నిలుస్తామని తెలిపారు లావణ్య. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలి అని, నిరుపేదలను ఆదుకోవాలి అని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మంజు, రజిత, సాయిలీల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ రూప ను అభినందించిన డిసిపి సురేష్ కుమార్







**కూకట్ పల్లి,అక్టోబర్21(వార్తప్రభ):**తెలంగాణ పోలీస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ నుండి 19 తేదీ వరకు నిర్వహించిన తెలంగాణ మొదటి పోలీస్ డ్యూటీ మీట్ లో ఫోరెన్సిక్ సైన్స్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన కె.పి.హెచ్.బి ఎస్ఐ రూప కు సిల్వర్ మేడల్ తో పోలీసు ఉన్నతాధికారులు సత్కరించారు. బాలనగర్ డిసిపి సురేష్ కుమార్, కూకట్ పల్లి ఏసీపి శ్రీనివాసరావు, కె.పి.హెచ్.బి సిఐ వెంకటేశ్వర్ రావు, ఎస్సైలు, పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు అభినందనలు తెలిపారు.

# హార్డ్ వర్క్, నాలెడ్జ్...లైఫ్ సక్సెస్ స్టెప్స్!!

- అవగాహనతో సమస్యలకు చెక్
- వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో "ఓపెన్ హౌస్"
- గోదావరిఖని వన్ టౌన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఇంద్రసేనారెడ్డి



**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)** హార్డ్ వర్క్, నాలెడ్జ్ లైఫ్ సక్సెస్ స్టెప్స్ అని తెలిపారు గోదావరిఖని వన్ టౌన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఇంద్రసేనారెడ్డి. ఈ మేరకు గోదావరిఖని ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో అమర వీరుల సంస్మరణ దినం పురస్కరించుకుని బుధవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరిఖనిలోని వివిధ ప్రైవేట్ కళాశాలల విద్యార్థులకు పోలీస్‌స్టేషన్ నిర్వహణ, నేరాలు నియంత్రణ ట్రాఫిక్ నిబంధనలు, దొంగతనాల్లో శిక్షలు, శాంతి భద్రతలు పరిరక్షణపై సిఐ ఇంద్రసేనారెడ్డి అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులకు డయల్ 100, షీ టీమ్, సైబర్ క్రైమ్, ఆయుధాల పనితీరు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు ఎస్ఐలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాతకు అభినందనల వెల్లువ...

ప్రత్యేకంగా అభినందనలు తెలియజేసిన కొప్పిశెట్టి దినేష్ కుమార్ గంధం రాజులు



**కూకట్ పల్లి,అక్టోబర్23 (వార్తప్రభ):**తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ గా నియమితులైన టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి కాల్వ సుజాతని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యక్షంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గానికి చెందిన నాయకులు గ్రేటర్ హైదరాబాద్ మాజీ ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి దినేష్ కుమార్, కెపిహెచ్బి డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ గంధం రాజు, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి పెండ్రు రమారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోతి నగర్ గౌడ సంఘం అధ్యక్షులు గంటా శ్రీనివాస్ గౌడ్ లు బుధవారం కాల్వ సుజాతను తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకే అందజేసి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా కాల్వ సుజాత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెడుతున్న పథకాలు ప్రభుత్వ ఆలోచనలు సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకొని వెళ్తే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలకు ఇంకా నమ్మకం కలుగుతుందని చెప్పారు.కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు పార్టీలో కష్టపడే వారికి తగిన గౌరవం ఇస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలకు గాని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు గాని ఏ కష్టం వచ్చినా ఆ సమస్య పరిష్కరించడానికి తాను ముందు వరుసలో ఉంటానని ఈ సందర్భంగా కాల్వ సుజాత హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజేష్ యాదవ్, సుబ్బు నాయుడు, దార్ల వనజ ,వీణ ,సుజాత, వాణి రోజా, దుర్గా ,సరోజ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు కార్యకర్తలు కృషి చేయాలి- మాజీ కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ

- కేంద్ర మాజీ మంత్రి 'సర్వే'ను ఘనంగా సత్కరించిన శేరి సతీష్ రెడ్డి



**కూకట్ పల్లి,అక్టోబర్23 (వార్తప్రభ):**కాంగ్రెస్ పార్టీ అధికారంలో కి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రతి కార్యకర్త తమ వంతు కృషి చేయాలని మాజీ కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ పిలుపునిచ్చారు. మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ ను కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి కాంగ్రెస్ నేతలతో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సర్వే సత్యనారాయణను శేరి సతీష్ రెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో కి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని వాటిని ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. భవిష్యత్తులో సైతం జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కూకట్ పల్లి కంటెస్టెడ్ అభ్యర్థి ప్రస్తుత కాంగ్రెస్ సీనియర్ నాయకులు బి సంజీవరావు, చిటకోరు కృష్ణ, రాచమల్ల శేఖర్ గౌడ్,సోషల్ మీడియా ఇంచార్జ్ జి శేఖర్,రావుఫ్, తదితరులు పాల్గొన్నారు.

# కె.పి.హెచ్.బి నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సేవలకు రేట్ల బోర్డులు




**కూకట్ పల్లి,అక్టోబర్23(వార్తప్రభ):**కె.పి.హెచ్.బి. నాయి బ్రాహ్మణ సేవా సంఘం కమిటీ హాలులో జిల్లా అధ్యక్షులు నరసింహ నాయి కెపిహెచ్బి అధ్యక్షుడు పన్నాటి రమేష్ నాయి,సెక్రటరీ వెంకటేశ్ నాయి,క్యాషియర్ జగన్నాయి, ఉపాధ్యక్షులు భాస్కర్ నాయి వార్డు మెంబర్స్ మరియు నాయి బ్రాహ్మణుల సమక్షంలో నిన్న జరిగిన మీటింగ్ ఏమిటంటే రేట్ల బోర్డులు డిస్ట్రిబ్యూట్ చేయడం జరిగినది వార్డు మెంబర్స్ కి నెక్స్ట్ వచ్చే నెల నుంచి ఫస్ట్ డేట్ నుంచి ప్రతి నెల 200 రూపాయలు వసూలు చేయాలని నిర్ణయం తీసుకుంది కమిటీ నెక్స్ట్ ప్రతి మంగళవారం షాపులు కొంతమంది ఓపెన్ చేయడం జరుగుతుంది. అది కూడా మంగళవారం నాడు ఓపెన్ చేస్తే 5000 రూపాయలు ఫైన్ వేయడం జరుగుతుంది. ఇంకోటి మన అందరి సమస్య మన తెలంగాణ సమస్య దానిమీద చర్చించడం జరిగింది. మనం అందరం ఎదుర్కొంటున్న సమస్య మనకు జీవో కావాలి మన వృత్తి మన హక్కు అనే నినాదం మనకు వచ్చేనెల 5 తారీఖు నాడు మంగళవారం డీజీపీ మనకు పర్మిషన్ ఇచ్చారు.ఇందిరాపార్క్ లో మనము ధర్నా చేసుకోవడానికి దీనికి తెలంగాణ మొత్తం అందరూ తరలి రావాలని ఈ ధర్నా ను విజయవంతం చేయాలని ఇది ధర్నా కాదు మన నాయి బ్రాహ్మణుల హక్కు మన నాయి బ్రాహ్మణుల పండగ మనము చేస్తున్న ఈ పోరాటం మన కోసం కాదు మన భావితరాల కోసం అందుకే మనము మన పిల్లలు మన భావితరాల పిల్లలు మన వృత్తి బ్రతికి ఉండాలి అంటే మనం తప్పకుండా ఐదు తారీకున చలో ఇంద్ర పార్క్ రండి తరలి రండి ఈ కార్యక్రమమును విజయవంతం చేయగలరని నా యొక్క మనవి నిన్న జరిగిన మీటింగ్ చాలామంది పెద్దలు కూడా రాలేరు ఇది మనము చేసే కార్యక్రమం చాలా పెద్దది ఇది మన ఓన్లీ మన కెపిహెచ్బి పెద్దలు మాత్రమే భుజాల మీద మోస్తున్నాము దీన్ని దయచేసి అందరూ కూడా విజయవంతం చేయాలని కోరుకుంటున్న అన్నారు.

## పై వంతెన పనుల వేగం పెంచాలి -బల్దియా కమీషనర్ ఇలంబర్తి



**శేరిలింగంపల్లి అక్టోబర్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)** బల్దియా నూతన కమీషనర్ ఇలంబర్తి బుధవారం శేరిలింగంపల్లి జోన్‌లో తొలిసారిగా పర్యటించారు.ఈ సందర్భంగా గచ్చిబౌలిలో నూతనంగా నిర్మాణం అవుతున్న శిల్పా లే అవుట్ ఫ్లై ఓవర్ ఫేజ్ 2 పనులను హెచ్ఎండీఏ కమీషనర్ సర్ఫరాజ్ అహ్మద్,ప్రాజెక్టు సీఈ దేవానంద్,జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డిలతో కలిసి నూతన కమిషనర్ బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ వరకు పనులను, తొలగించాల్సిన విద్యుత్ స్తంబాలు,విస్తరించాల్సిన రహదారులను చూసారు. అనంతరం కమీషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ పై ఓవర్ నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలని సూచించారు.నిత్యం ట్రాఫిక్‌తో ఉండే కీలక రహదారిపై ఈ పనులు జరుగుతున్నందున జాప్యం చేయవద్దని,గుత్తేదారు త్వరిత గతిన పూర్తి చేసేలా కృషి చేయాలని ఆదేశించారు. రహదారి విస్తరణకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంబాలు కేబుళ్ల మార్పులో సంబంధిత శాఖ నుంచి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు.ర్యాంపు నిర్మాణం నిమిత్తం తాత్కాలిక రహదారి నిర్మాణానికి విద్యుత్ కేబుళ్ల మార్పుతో ముడిపడి ఉన్నందున అధికారులు పనులను వేగవంతం చేయాలని కమీషనర్ ఇలంబర్తి స్పష్టం చేసారు. పై వంతెన నిర్మాణ పనులను అధికారులు ఎప్పటికపుడు పర్యవేక్షిస్తూ పురోగతి నమోదయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. కూడళ్ల అభివృద్ధి సుందరీకరణ పనులతో పాటు సర్వీసు రహదారుల నిర్మాణ ప్రక్రియను వేగం చేయాలని కమీషనర్ ఇలంబర్తి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టి.జీ.ఎస్.పి.డి.సి.ఎల్ అధికారులు మరియు జోన్ అధికారులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన ఏజీపీకి సన్మానం

**వేములవాడ, అక్టోబర్ 23:( వార్త ప్రభ)** వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా నూతనంగా నియామకమైన పుప్పాల భాను కృష్ణను బుధవారం వేములవాడ బార్ అసోసియేషన్ హాల్లో న్యాయవాదులు ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం మాట్లాడుతూ ప్రభుత్వపరంగా మూడు సంవత్సరాల కాలం పాటు ఏజీపీగా నియామకమైన భాను కృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రభుత్వపరంగా కక్షిదారులకు సరైన న్యాయం చేసే విధంగా ఏజీపీ పోస్టుకు వన్నెతెచ్చే విధంగా సామాన్యులకు సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రజనీకాంత్, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, తిరుమల్ గౌడ్, వేముల సుధాకర్ రెడ్డి, పిట్టల మనోహర్ న్యాయవాదులు, మహిళ న్యాయవాదులు పాల్గొన్నారు.



వార్తా ప్రభ

# హైదరాబాద్

## మతసామరస్యానికి ప్రతీక గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలు!!

- ప్రతి ఒక్కరు ప్రేమను పంచాలి.. సోదర భావంతో జీవించాలి
- రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎం.శ్రీనివాస్





**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)** మతసామరస్యానికి ప్రతీక గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలు అని అన్నారు రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎం.శ్రీనివాస్. ఈ మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ లో గ్యార్మీ వేడుకలను బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీపీ ఎం.శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ, ముస్లిం, క్రిస్టియన్లకు సంబంధించిన ప్రార్థనా మందిరాలు ఒకే చోట ఉండడం అభినందనీయం అని అన్నారు. ఆయా మతాలకు సంబంధించిన ముఖ్యమైన పర్వదినాలు కమిషనరేట్ పోలీసుశాఖ ఘనంగా నిర్వహిస్తుండటం ఆనవాయితీగా వస్తోందన్నారు. అందరూ కలిసిమెలిసి హోదాలు మరచి ఒకే చోట భోజనం చేయడం శుభ పరిణామం అన్నారు. ప్రతి ఒక్కరు ప్రేమను పంచాలి.. సోదర భావంతో జీవించాలి అని సూచించారు. ఉత్సవాలలో అడిషనల్ డీసీపీ అడ్మిన్, పలువురు ఏసీపీలు, సిఐలు పాల్గొన్నారు.

## "అడ్డగూడూర్ ప్రెస్ క్లబ్ కొరకై స్థల పరిశీలన"



**అడ్డగూడూరు: అక్టోబర్ 23( వార్త ప్రభ)**యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ కొరకై స్థలాన్ని పరిశీలించిన రెవిన్యూ అధికారులు ప్రెస్ క్లబ్ కొరకై స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు కు అడ్డగూడూరు మండల విలేకరులు గత కొద్ది రోజుల క్రితం వినతిపత్రం అందజేశారు. ఇట్టి విషయంపై స్థానిక ఎమ్మెల్యే స్పందించి తక్షణమే ప్రెస్ క్లబ్ కొరకై స్థలాన్ని పరిశీలించాలని రెవెన్యూ అధికారులను సూచించారు.బుధవారం రైతు వేదిక దగ్గర్లో ఉన్న స్థలాన్ని రెవిన్యూ అధికారులు పరిశీలించారు. సర్వే చేసి ప్రెస్ క్లబ్ కొరకు స్థలాన్ని కేటాయించేటట్లు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ రాజేష్ , సర్వేయర్ భూక్య నాయక్, అడ్డగూడూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కడియం సంజీవ, విలేకర్ నోముల ఉపేందర్, రెవిన్యూ సిబ్బంది సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ డిస్ట్రిక్ట్ ట్రాక్ సైక్లింగ్ పోటీలో విద్యార్థుల ప్రతిభ

**కరీంనగర్, అక్టోబర్ 23:( వార్త ప్రభ)** ఈ నెల 18వ తేదీ నుండి 20వ తేదీ వరకు హైదరాబాద్ లోని వెలో డ్రాంలో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ ట్రాక్ సైక్లింగ్ పోటీలో కరీంనగర్ జిల్లాకు చెందిన వంగల హృతికేష్ అద్భుతమైనటువంటి ప్రతిభను కనబరిచి సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. గత కొంతకాలంగా హైదరాబాదులో కోచ్ భార్గవ్ వద్ద సైక్లింగ్ లో శిక్షణ పొందుతున్న హృతికేశ్ అనతి కాలంలోనే సైక్లింగ్ లో ఎన్నో మెలకువలు నేర్చుకుని అద్భుతమైన ప్రతిభను కనబరుస్తూ అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తున్నాడు. అక్కడ సైక్లింగ్ లో శిక్షణ పొందుతున్న, శిక్షణ ఇస్తున్న కోచ్ లు సైతం హృతికేశ్ ను హృదయపూర్వకంగా అభినందిస్తున్నారు. కరీంనగర్ కు మరొక సాయి కృష్ణ లాంటి ఆణిముత్యం లభించిందని అభిప్రాయపడుతున్నారు. హృతి కేష్ గొప్ప ప్రతిభను కనబరిచి జాతీయస్థాయి ట్రాక్ సైక్లింగ్ పోటీలకు ఎంపిక కావడం కరీంనగర్ జిల్లాకే గర్వకారణంగా చెప్పొచ్చు. అలాగే 2000 మీటర్స్ ఫర్ షూట్ ఈవెంట్ లో కూడా సిల్వర్ మెడల్ సాధించి అందరిని ఆశ్చర్య చకితులను చేశాడు. వంగల హృతి కేష్ తన యొక్క గొప్ప ప్రతిభతో దినదినాభివృద్ధి చెందుతూ రాకెట్ లా ముందుకు దూసుకెల్తూ కరీంనగర్ జిల్లాకు గొప్ప కీర్తి ప్రతిష్టలను తెచ్చిపెడుతున్నందుకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, నగర మేయర్ వై సునీల్ రావు, బిఆర్ఎస్ కరీంనగర్ అధ్యక్షులు చల్లా హరిశంకర్, , హృతికేష్ ని హృదయపూర్వకంగా అభినందించారు.

# ఎడిటోరియల్

## జగన్ ని మానసిక క్షోభకు గురి చేసిన ఆమె ?

వైఎస్ జగన్ అంటేనే ఒక విషయం గుర్తుకు వస్తుంది. ఆయన పట్టుదలకు మారు పేరుగా ఉంటారని కూడా అంటారు. జగన్ ముక్కుసూటిగా ఉంటారు. తాను ఏది నిజం అని నమ్మితే దానిని అమలు చేస్తారు. ఈ విషయంలో రెండవ మాట అనేదే ఉండదు, అంతే కాదు తను కాదు అనుకున్న వారి విషయంలో ఆయన అవసరమైతే కఠినంగా కూడా ఉంటారు.ఇవన్నీ ఇపుడు ఎందుకు అంటే జగన్ గురించి అందరి కంటే ఎక్కువ తెలిసిన ఆమె ఆయనకు దూరం అయ్యారు. ఆమె ఎవరో కాదు రక్తం పంచుకుని పుట్టిన చెల్లెలు వైఎస్ షర్మిల. ఆమె జగన్ కి ఎదురు నిలిచి 2024 ఎన్నికల్లో పోరాడారు. కాంగ్రెస్ తరపున ఏపీకి వచ్చి జగన్ కి ఎంత నష్టం చేయాలో అంతా చేశారు.ప్రతీ కుటుంబంలో విభేదాలు ఉండడం సహజమే కానీ అవి వైఎస్సార్ ఫ్యామిలీలో పీక్స్ కి వెళ్ళిపోయాయి. ఇపుడు అవి బాహాటం అయ్యాయని తెలుస్తోంది. జగన్ హైదరాబాద్‌లోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి)కి సమర్పించిన పిటిషన్‌లో షర్మిల పట్ల ప్రస్తుతం తనకు ఉన్న భావాలు ఏమిటో కుండబద్దలు కొట్టారు అని అంటున్నారు.ఆమె అంటే వైఎస్ షర్మిల, కృతజ్ఞత లేకుండా, నా శ్రేయస్సు గురించి పట్టించుకోకుండా, నన్ను తీవ్రంగా బాధించే చర్యలు చేస్తూ వెళుతోంది అని ఆయన కోర్టుకు దాఖలు చేసిన పిటిషన్ లో పేర్కొనడం విశేషం. అంతే కాదు ఆమె చేసిన పనులే కాకుండా, బహిరంగంగా అసత్య, తప్పుడు ప్రకటనలతో పాటు, రాజకీయంగా నన్ను వ్యతిరేకించింది అని కూడా ఈ మధ్యకాలంలో జరిగిన పరిణామాలను ఆయన ప్రస్తావించారు.ఇక ఆమె వైఖరితో తనకు వ్యక్తిగతంగా అపకీర్తిని కలిగించాయని కూడా ఆయన చెప్పడం విశేషం. మొత్తానికి చూస్తే కనుక తన సోదరి షర్మిల తీరు వల్ల తనకు ఎంతో మానసిక క్షోభను కూడా కలిగించిందని వైఎస్ జగన్ తెలిపారు.ఈ క్రమంలోనే తమ మధ్య ఉన్న ప్రేమ, ఆప్యాయతలన్నీ దెబ్బతిన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఇక తన మీద ఆమె చేసిన ఆరోపణలన్నీ రాజకీయంగా ప్రేరేపించినవి ఇవి తనకు తీవ్ర వేదనకు గురిచేశాయని వైఎస్ జగన్ అన్నారు. ఇవన్నీ కూడా సరస్వతీ పవర్ కంపెనీలో వాటాలకు సంబంధించి ఈ పిటిషన్‌లో ప్రస్తావించారు.ఇదిలా ఉంటే వైఎస్ షర్మిల తనను తీవ్రంగా మానసిక క్షోభకు గురి చేశారు అని జగన్ చెప్పడం మాత్రం విశేషంగా పేర్కొంటున్నారు. ఎందుచేతనంటే ఈ అన్నాచెల్లెళ్ళు ఎప్పటికి అయినా కలుస్తారు అని అంతా అనుకున్నారు. కానీ ఇద్దరి దారులు వేరు అని అర్థం అవుతోంది అంటున్నారు. రాజకీయాల్లో అన్నకు పోటీగా షర్మిల వేరే పార్టీ ద్వారా ముందుకు సాగుతున్నారు. అయితే ఇది కూడా ఏమంత పెద్ద విశేషం కాదు.ఒకే కుటుంబం నుంచి చాలా మంది వేరు వేరు పార్టీల ద్వారా రాజకీయం చేయడాన్ని అంతా చూస్తున్నారు.

## సంగం జెడ్పీ హైస్కూల్ ప్లస్ ను ఆకస్మిక తనిఖీ చేసిన ఆర్ఐఓ

- విద్యా బోధన గురించి ఇంటర్మీడియట్ విద్యార్థులను అడిగి తెలుసుకున్న ఆర్ఐఓ డాక్టర్ శ్రీనివాసులు






**సంగం, అక్టోబర్ 23 (వార్తప్రభ):** శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం జెడ్పీ హైస్కూల్ ప్లస్ ను ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐఓ డా.శ్రీనివాసులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులు పరిశీలించి. ఇంటర్మీడియట్ బోధించే ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు 187 ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 38 హైస్కూల్ ప్లస్ కళాశాలలు మంజూరయ్యాయని.. వాటిలో 17 కళాశాలలో తరగతులు నడుస్తున్నాయని తెలిపారు. హై స్కూల్ ప్లస్ లలో ఉన్న విద్యార్థులకు విద్యా ప్రమాణాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమం కోసం తీసుకోవాల్సిన అన్నీ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు హై స్కూల్ ప్లస్ ను సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను ప్రభుత్వ కాలేజీల్లో చేర్పించాలని సూచించారు. ఈయన వెంట ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య ఉన్నారు.

## నూతన వస్త్ర బహూకరణ కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి



**కలిదిండి అక్టోబర్ 23 (వార్తా ప్రభ)** స్థానిక మండల పరిధిలోని ఇందిరా కాలనీ వాస్తవ్యులు ఊసల యోహాను కమల కుమారి దంపతుల ఆహ్వానం మేరకు వారి కుమార్తె కుమారుడు సైనీ విక్టోరియా, దానియేలు విక్టర్ ల నూతన వస్త్ర బహుకరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించిన కలిదిండి మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి (నాని) కూటమి నాయకులు జక్కుల విజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో కలిదిండి టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు కురేళ్ళ కొండ, కురేళ్ళ శ్రీనివాసరావు,లేళ్ళ సుబ్బారావు,తెలుగు నవ గర్జన పార్టీ ఇంఛార్జి జి ఈశ్వర్, వెంకటాపురం ఎస్ఎమ్సీ చైర్మన్ వి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బిల్లుపై కేంద్రం లేనిపక్షంలో ఎన్ఆర్సీ తరహా పోరాటం తప్పదు

- ముఖ్యమంత్రి బిల్లును వ్యతిరేకించాలి
- రాష్ట్ర ఆహలే సున్నతుల్ జమాత్ డిమాండ్



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 23(వార్తా ప్రభ ప్రతినిధి):-** కేంద్ర ప్రభుత్వం త్వరలో పార్లమెంట్ లో ప్రవేశపెట్టబోయే వక్ఫ్ బోర్డు బిల్లుపై పునరాలోచించాలని, లేనిపక్షంలో దేశంలో మరోసారి ఎన్ఆర్సీ స్థాయి పోరాటం తప్పదని హెచ్చరించారు ఆంధ్రప్రదేశ్ అహలె సున్నతుల్ జమాత్ పెద్దలు. వక్ఫ్ బోర్డ్ బిల్లును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ముస్లిం సమాజాలు నిరసన తెలుపుతున్నాయి. అందులో భాగంగా రాష్ట్ర అహలే సున్నతుల్ జమాత్ ఆధ్వర్యంలో కొండపల్లి హజరత్ సయ్యద్ షాబుఖారి ఆస్థానాలో బుధవారం సున్ని కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ కు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సున్ని జమాత్ కు చెందిన ముస్లిం మత పెద్దలు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో ప్రవేశపెట్టబోయే బిల్లును అందరూ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా దేశంలో ముస్లింలు నిరసనలు తెలుపుతున్నారని, ముఖ్యంగా బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రులు బిల్లును వ్యతిరేకిస్తే తప్పకుండా పార్లమెంట్ లో బిల్లు వీగిపోతుందన్నారు. అందుకోసం బీహార్ మరియు ఆంధ్రప్రదేశ్ లో ముస్లింలు ఆయా ముఖ్యమంత్రుల పై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముస్లింల పక్షపాతిగా పేరుపొందారని, తప్పకుండా ఆయన ముస్లింల వ్యతిరేక చర్యలకు మద్దతు తెలపరని ఆశాభావం వ్యక్తం చేశారు.దేశంలో రైల్వే ఆస్తుల తర్వాత ఆ స్థాయి ఆస్తులు ఉన్న వక్ఫ్ బోర్డు ముస్లింల అభ్యున్నతికి నోచుకోకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో కూడా ఎన్నో వక్ఫ్ బోర్డు అసలు అన్యాక్రాంతం అయ్యాయని, వాటిపై కూడా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి వెనక్కి తగ్గాలని లేనిపక్షంలో దేశంలో ఉన్న ప్రతి ముస్లిం తన కుటుంబంతో కలిసి రోడ్డు మీదకు వచ్చి నిరసన తెలిపేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ కి చెందిన ముఫ్తీ సుల్తాన్ రాజా, అజ్మీర్ నుంచి విచ్చేసిన సూఫీ అజ్మీరే సాజిద్ హుస్సేన్, జంషెడ్ పూర్ టాటా కు చెందిన ముఫ్తీ సలాహుద్దీన్, షాహిద్ రజా, బిలాల్ నాసిక్, రాష్ట్ర ఆలేస్ సున్నతులు జమాత్ కన్వీనర్ గౌహార్ ఆలం, అహలే సున్నతుల్ జమాత్ బోర్డు కో కన్వీనర్ మరియు ముస్లిం పర్సనల్ లా బోర్డు రాష్ట్ర అధ్యక్షులు అల్తాఫ్ రజా, ముక్తి సమివుజమా, నయీమ్ అక్తర్, అప్సర్జమా, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ముస్లిం మతగురువులు ముతవల్లీలు పాల్గొన్నారు.

## అమ్మవారి అనుగ్రహం, సీఎం చంద్రబాబు కృషి వల్లే ఐదు గిన్నిస్ రికార్డులు సొంతం

- విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**అమ్మవారిని దర్శించుకున్న కేంద్రమంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలుఆలయ మర్యాదలతో అధికారులు ఈవో ఘన స్వాగతం పలికారు. ఇంద్రకీలాద్రి పై అమ్మవారి ఆశీస్సులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి వల్లే డ్రోన్ హాక్ థాన్ ఐదు గిన్నిస్ రికార్డులు నమోదు చేసుకుందని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ అన్నారు. ఇంద్రకీలాద్రి కొలువుదీరిన కనకదుర్గ అమ్మవారిని కేంద్ర పౌరవిమానాయన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ , అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ , మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ప్రజాప్రతినిధులందరికీ ఆలయ ఈవో కె.ఎస్.రామారావు ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి వారికి తీర్థప్రసాదాలు అందజేయగా, ఆలయ ఈవో అమ్మవారి చిత్రపటాలు బహుకరించారు. అమ్మవారి అనుగ్రహం, సీఎం చంద్రబాబు సంకల్పం వల్లే దేశంలో మొదటిసారి ఇంత పెద్ద స్థాయిలో డ్రోన్ సమ్మిట్ -2024 అమరావతి రాజధాని లో ఏర్పాటు చేయటం జరిగిందని కేంద్ర పౌరవిమానాయన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా, సుఖ సంతోషాలతో జీవించేలా అమ్మవారి కరుణా కటాక్షాలు వుండేలని వేడుకున్నట్లు ప్రజాప్రతినిధులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రక్షక భటుల నిలయంలో ఫిర్యాదుదారులకు రక్షణ కరువు?



**మచిలీపట్నం అక్టోబర్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం ఆర్ పేట పోలీస్ స్టేషన్ లో బాధితుడికి చేదు అనుభవం ఎదురైంది. విద్యుత్ శాఖలో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగి వడ్లమూడి రఘురాం పై దాడి చేసినవారే పోలీసుల ఎదుటే దాడికి పాల్పడ్డాడని సోషల్ మీడియాలో బాధితుల ఆవేదన వైరల్ అవుతుంది. స్థానికంగా ఈ ఘటన సంచనం సృష్టించింది. సేకరించిన వివరాల ప్రకారం నిజాంపేట లో వడ్లమూడి జయరాం అతని తల్లి (90) భార్య సుమన నివాసం ఉంటున్నారు. వారి ఇంటి ఎదురుగా ఉన్న అడపాల హర్ష, వరలక్ష్మి ,హేమ తో పాటు వారి అనుచరులు పది రోజులుగా డీజే బాక్స్ లతో పెద్ద సౌండ్స్ పెట్టి తీవ్రంగా ఇబ్బందులు పెడుతున్నారు. మా అత్తగారు 90 సంవత్సరాల వృద్ధురాలు కొన్ని రోజులుగా హృదయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఇంటి ముందు డిజె బాక్స్ లతో పెద్ద పెద్ద ధ్వనులు, శబ్దాలు సృష్టించి మమ్మల్ని ఇబ్బంది పెట్టవద్దని వడ్లమూడి రఘురాం అతని భార్య హర్షను అతని అనుచరులను వేడుకున్నారు. అయినా హర్ష తదితరులు రఘురాం మాటలను లెక్కచేయకుండా సౌండ్స్ పెడుతున్నారు. దీనిపై సుమన సౌండ్ వద్దని చెబుతున్నందుకు నువ్వు మాకు చెప్పేటంత దానివా? అంటూ సుమన ఇంటి పై దాడి చేసారు. దీనితో సుమన ఆమె భర్త రఘు రాం భయపడి ఆర్ పేట పోలీస్ స్టేషన్ లో తమపై జరిగిన దాడి పై ఫిర్యాదు చేశారు. సదర్ ఫిర్యాదు ఇక్కడే కీలక మలుపు తిరిగింది దాడి చేసిన వారు తమపై సుమన కుటుంబం దాడి చేసిందని పోలీస్ స్టేషన్లో అడపాల హర్ష ఫిర్యాదు చేశాడు.ఈ నేపథ్యంలో సుమన కుటుంబం తమపై జరిగిన దాడినీ పోలీసులకు వివరిస్తూ ఉండగా కోపంతో ఊగిపోయిన హర్ష, వడ్లమూడి రఘురాంపై దాడి చేసి పిడిగుద్దులు గుద్ది కంటిపై గాయం చేశాడు. కంటి పై గాయానికి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేసుకుంటామని సుమన భర్త రఘురాం ను తీసుకువె ళ్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తానని వివరించింది. సాక్షాత్తు పోలీస్ స్టేషన్ లోనే దాడి చేసి గాయపరిస్తే అడ్డుకోవలసిన పోలీసులు గాయపరిచిన వ్యక్తికి అనుకూలంగా నడుచుకోవడం పోలీసుల పనితీరును తప్పు పట్టాల్సి వస్తోంది? న్యాయం కోసం పోలీస్ స్టేషన్ కు వస్తే వచ్చిన వారిపైన దౌర్జన్యం చేస్తున్న పోలీసు వారు మౌనం వెనుక నగరానికి చెందిన ఒక ప్రముఖ వ్యక్తి కథ నడిపించాడని జోరుగా ప్రచారం సాగుతోంది.కొసమెరుపు: ఎవరిని ఎవరు బెదిరించారో తెలియదు గాని పోలీస్ స్టేషన్లో ఇరువురి మధ్య రాజీ కుదిరిందని ఆర్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ చెప్పారు అందుచేత కేసు నమోదు కాలేదు?

## గుంటలు పూడ్చారు

### వార్తా ప్రభ కథనానికి స్పందన



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 23(వార్తా ప్రభ ప్రతినిధి):-**ఖీల్లా రోడ్డు లో బూడిద లారీల వలన రోడ్డు అధ్వానంగా తయారైంది. ప్రజలు కనీసం ఆ దారిలో వెళ్ళలేని పరిస్థితి. ఈ నెల 20 న ఈ రోడ్డు లో వెళ్ళేదెల శీర్షిక పేరు తో వార్తా ప్రభ లో కథనం ప్రచురితం అయ్యింది. స్పందించిన ఎన్టీటీపీస్ అధికారులు గుంతలను చిప్స్ తో తాత్కాలిక మరమ్మత్తులు చేయించారు. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.పూర్తి మరమ్మత్తులు చేయించి శాశ్వత మరమ్మత్తులు చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## ఏఆర్ అడిషనల్ ఎస్పీ గా బాధ్యతలు చేపట్టిన బి. సత్యనారాయణ.



**మచిలీపట్నం అక్టోబర్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)** కృష్ణా జిల్లా నూతన ఏ.ఆర్ అడిషనల్ ఎస్పీగా బి. సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర రావు ని జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ జిల్లా నుండి కృష్ణా జిల్లాకు బదిలీపై వచ్చిన ఏ.ఆర్ అడిషనల్ ఎస్పీ బి. సత్యనారాయణ గతంలో ఇదే జిల్లాలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ గా పని చేసిన అనుభవం ఉన్నది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏఆర్ విభాగం నందు సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ నూతన ప్రణాళికలు రూపొందిస్తూ, సిబ్బంది సంక్షేమానికి ప్రధాన భూమికను పోషిస్తూ కృషి చేయాలని తెలిపారు.

## ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవం జయప్రదం చేయండి

**అనంతపురం: అక్టోబర్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)**అనంతపురం నగరంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు ఎస్ రాజేష్ గౌడ్ అధ్యక్షత వహించారు.

## విజయవాడ నుండి అహ్మదాబాద్ మధ్య విమాన సర్వీసులు ఏర్పాటు చెయ్యండి

**ఎమ్ పి కేశినేని శివనాథ్ కి వినతిపత్రం అందించిన ఎన్టీఆర్ జిల్లా తెదేపా వాణిజ్య విభాగం అధ్యక్షులు రాజు సోలంకి**



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర కుమార్ సోలంకి బుధవారం. ఎమ్ పి కేశినేని శివనాథ్ ని స్వయంగా కలిశారు. విజయవాడ నుండి అహ్మదాబాద్ మధ్య విమాన సేవలు ప్రారంభించడానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాజు సోలంకి మాట్లాడుతూ విజయవాడ-అహ్మదాబాద్ మధ్య విమాన సర్వీసులు కనెక్షన్ లోపం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు మరియు కష్టాలను ఎమ్ పి కి వివరించారు. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని కోరగా ఎమ్ పి స్పందిస్తూ తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తగిన చర్యలకు హామీ ఇచ్చినందుకు ఎంపీ కేశినేని శివనాథ్ కి రాజు సోలంకి ధన్యవాదాలు తెలిపారు.

## మూలే వారి జన్మదిన వేడుకలలో పాల్గొన్న బైరెడ్డి, దారపనేని



**కనిగిరి అక్టోబర్ 23 వార్తా ప్రభ ప్రతినిధి** మూలే కోటిరెడ్డి, సతీమణి శ్రీదేవి దంపతుల కుమారుడు హైడ్రా పవర్ అధినేత మూలే సురేంద్ర సతీమణి నమ్రత ల కుమార్తె నాగజైనిక రెడ్డి మొదటి జన్మదిన వేడుకలు విజయవాడలోని కానూరు లోని వారి స్వగృహంలో బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో అధ్యక్షులు బైరెడ్డి జయ రామిరెడ్డి పాల్గొని చిరంజీవి నాగ జైనికా రెడ్డి ని అక్షింతలు వేసి ఆశీర్వదించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాగ జైనికా రెడ్డి తాత ఎం కొండారెడ్డి, అమ్మమ్మ శివకుమారి మనవరాలి జన్మదిన వేడుకలలో పాల్గొని అక్షింతలతో నాగజైనికా రెడ్డిని ఆశీర్వదించారు. ఈ జన్మదిన వేడుకలలో వెంకటేశ్వర్ రెడ్డి, పోలు సుధాకర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, కృష్ణారెడ్డి, మూలే సురేంద్ర మిత్ర బృందం, బంధుమిత్రులు శ్రేయోభిలాషులు పాల్గొని నాగ జై నికా రెడ్డిని అక్షింతలతో ఆశీర్వదించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## పడమటి పాలెం లో పొలం పిలుస్తుంది కార్యక్రమం






**సంగం, అక్టోబర్ 23 (వార్తప్రభ):** శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా సంగం మండలం పడమటిపాలెం రైతు సేవా కేంద్రం లో వ్యవసాయాధికారి శ్రీహరి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి పి.సత్యవాణి పాల్గొని రబీ సీజన్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. రైతులు వర్షాకాలం లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 28 వేల క్వింటాళ్ళ విత్తనాలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. జిల్లాలో 2 లక్షల టన్నులు ఎరువులు అవసరం ఉందని ప్రభుత్వానికి నివేదికలు పంపామని తెలిపారు. ప్రస్తుతానికి జిల్లాలో 38 వేల 500 మెట్రిక్ టన్నులు ఎరువులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయనీ అన్నారు. జిల్లాలో పురుగు మందులు, ఎరువుల కొరత లేకుండా గట్టి చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు శేషగిరి, సుజాత, హార్టికల్చర్ అధికారి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి రామ్మోహన నాయుడిని మర్యాదపూర్వకంగా కలిసిన జంపాల



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి):-** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన నాయుడిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని ఎంపీ కేశినేని శివనాథ్ స్వగృహంలో మంత్రి కింజరపు, ఎంపీలు సిఎం.రమేష్, కేశినేని శివనాథ్ బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రిని కలిసిన జంపాల పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. విజయవాడ (గన్నవరం) విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఇళ్ళలో దొంగతనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు.

**విజయవాడ పశ్చిమఅక్టోబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సమాజంలో వివిధ రకాల నేరాలు జరుగుతూ ఉంటాయి, నేరాలు జరిగిన తరువాత దర్యాప్తు చేసేకంటే, అవి జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మరియు ప్రయాణం చేయు సమయంలో ఏమరపాటుగా ఉండటం వలన జరిగే నేరాల గురించి అవగాహన కల్పించడం ద్వారా నేరాలకు అడ్డుకట్ట వేయాలనే ప్రధాన ఉద్దేశ్యంతో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు క్రైమ్ డి.సి.పి. తిరుమలేశ్వర రెడ్డి గారి పర్యవేక్షణలో క్రైమ్ ఏ.డి.సి.పి. ఎం.రాజారావు ఆధ్వర్యంలో సి.సి.ఎస్. ఇన్స్పెక్టర్లు వారి సిబ్బందితో కలిసి నగరంలోని ముఖ్య ప్రదేశాలలో, అపార్ట్మెంట్ల లోని ప్రజలకు దొంగతనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్.టి.ఆర్.%డ% వెటర్నరీ కలని పార్క్ నందు పరిసర ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి, దొంగతనాలు ఏవిధంగా జరుగుతాయి మరియు నేరాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, పోలీస్ కమీషనర్ ప్రవేశపెట్టిన ఈ పహారా గురించి, డైయల్ 100, 112, ఎల్.హెచ్.ఎమ్.యస్ యాప్ వలన కలిగే ఉపయోగాలు గురించి క్రైమ్. ఏ.డి.సి.పి. ఎం.రాజారావు , ఇన్స్పెక్టర్ ఎస్ వి వి లక్ష్మి నారాయణ సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైమ్. ఏ.డి.సి.పి. ఎం.రాజారావు సమావేశంలోని ప్రజలతో మాట్లాడుతూ..... ఊరు వెళ్ళే



సమయంలో తప్పనిసరిగా లోకల్ పోలీస్ వారికి సమాచారం అందించాలని, ఎల్.హెచ్.ఎమ్.యస్ ను ఉపయోగించుకో వాలని, దీని వలన ఎవరైనా దొంగ ఇంటిలోనికి వస్తే వెంటనే అలారం మోగడం తోపాటు సమీపంలోని పోలీస్ స్టేషన్ కు సమాచారం చేరి దొంగలను పట్టుకోవచ్చు మరియు దొంగతనం జరగకుండా చూడవచ్చని, మీ దగ్గర ఉన్న విలువైన వస్తువులను లాకర్స్ లలో పెట్టుకోవాలని, పోలీస్ కమీషనర్ ప్రత్యేకంగా ఈ పహారా యాప్ ద్వారా బీటు పోలీస్ వారికీ త్వరితగతిన సూచనలు అందించడానికి ఉపయోగపడుతుందని వివరించడం జరిగింది. అదేవిధంగా సైబర్ క్రైమ్ నేరాలు ఏవిధంగా జరుగుతాయి, సైబర్ నేరాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, సైబర్ సిటిజన్ యాప్ ద్వారా ఏవిధంగా సైబర్ నేరాలపై అవగాహన కలిగి సైబర్ సిటిజన్ గా అవ్వాలనే విషయాలపై కూలకుషంగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్రైమ్. ఏ.డి.సి.పి. ఎం.రాజారావు , ఇన్స్పెక్టర్ ఎస్ వి వి లక్ష్మి నారాయణ, పార్క్ ట్రెజర్ గోపాల కృష్ణ సెక్రటరీ నరసింహారావు మరియు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

## కమలా నెహ్రూ హాస్టల్ ప్రహరీ గోడ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయండి

### విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు ఆదేశాలు





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా 23వ డివిజన్ సూర్యారావుపేట నందున్న కమలా నెహ్రూ విమెన్స్ హాస్టల్, మహిళా శిశు బాల సంక్షేమ సదరం ను పరిశీలించారు. హాస్టల్ వద్ద ప్రహరీ కూలిపోయింది అని తెలిసిన వెంటనే అధికారులను గోడ పునః నిర్మించడానికి కమిషనర్ ఆదేశాలు ఇవ్వగా, బుధవారం ఉదయం అధికారులతో వారి కార్యాచరణను విమెన్స్ హాస్టల్ వద్ద స్వయంగా తానే పరిశీలించారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి ప్రహరీని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మించేటప్పుడు ట్రాఫిక్కు అంతరాయం లేకుండా ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలి అని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ జీ వి జీ ఎస్ వి ప్రసాద్, సూపరింటింగ్ ఇంజనీర్ వర్క్స్ పి సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీ సామ్రాజ్యం, ఇతర ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## తూర్పుపల్లి లో పొలం పిలుస్తుంది కార్యక్రమం



**చేజర్ల అక్టోబర్ 23 (వార్తాప్రభ)** మండలంలోని తూరుపల్లి కోటితీర్థం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిం చడం అయినది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శశిధర్ మాట్లాడుతూ రైతులకు అనుకూలంగా లాభసాటి వ్యవసాయాన్ని ఎలా చేయాలో రైతులకు వివరించారు. ఈ కార్యక్రమాల్లో తూరుపల్లి గ్రామ రైతులు కోటితీర్థం గ్రామ రైతులు పాల్గొన్నారు. పలు రకాల పంటలను గూర్చి రైతులు అవగాహన చేసుకోవడం జరిగినది.

## నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలి



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కంప్యూటర్ రంగ విద్యార్థులు తమ రంగానికి సంబంధించిన నూతన అంశాలపై నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలని కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ కృష్ణవేణి అన్నారు. ఆ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో మొంగో డీబీ జెన్ ఏఐపై ఒక రోజు హ్యాకథాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ విద్యార్థులు వర్క్‌షాప్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నిపుణుల సూచనలతో విద్యార్థులు ఆయా అంశాలపై పట్టు సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు సాయంత్రం బహుమతులను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులకు వారివారి రంగంల్లో నూతనంగా వస్తున్న ఆవిష్కరణలను, మార్పులను తెలియజేసేందుకు ఈ విధమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా కంప్యూటర్స్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. వాటిని అర్థం చేసుకోవాలని, వాటిపై పట్టు సాధించాలని సూచించారు. అప్పుడే విజయాలను సాధిస్తారని వివరించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు పీ రవీంద్ర, పవన్‌కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

## మిస్టరీగా మారిన.. షేక్ హసీనా 'రాజీనామా లేఖ'

బంగ్లాదేశ్‌లో విద్యార్థుల ఆగ్రహానికి గురైన షేక్ హసీనా ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసి దేశం వీడాల్సి వచ్చింది. అక్కడ తాజాగా మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే, ఈసారి మాత్రం దేశాధ్యక్ష పదవి నుంచి మొహమ్మద్ షహాబుద్దీన్ వైదొలగాలని డిమాండు చేస్తూ అధ్యక్ష భవనం 'బంగా భబన్'ను ఆందోళనకారులు చుట్టుముట్టారు. ఇందుకు షేక్ హసీనా 'రాజీనామా లేఖ' కారణ మయ్యింది. ఆ లేఖ గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు తాజా దుమారానికి తెరలేపాయి. ఇంతకీ ఏం జరిగిందంటే..! బంగ్లాదేశ్ అధ్యక్షుడు మొహమ్మద్ షహాబుద్దీన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "ఆ రోజు షేక్ హసీనా ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసినట్లు విన్నాను. అయి నప్పటికీ దానిని ధ్రువీకరించేందుకు రాజీనామా లేఖ సహా నా దగ్గర ఎటువంటి ఆధారాలు లేవు. ఎంత ప్రయత్నించినా ఆ లేఖ లభ్యం కాలేదు. బహుశా లేఖ ఇచ్చేందుకు ఆమె (షేక్ హసీనా)కు సమయం ఉండక పోవచ్చు" అని పేర్కొన్నారు. ఇదే విషయంపై సైన్యాధిపతిని వాకబు చేయగా అక్కడ నుంచీ ఇదేవిధమైన సమాధానం వచ్చిందన్నారు. హసీనా రాజీనామా లేఖ గురించి అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలపై తాత్కాలిక ప్రభుత్వం అసహనం వ్యక్తం చేసింది. అధ్యక్షుడు విరుద్ధ ప్రకటనలు చేశారని ప్రస్తుత ప్రభుత్వ న్యాయ సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ పేర్కొన్నారు. "తన వద్ద హసీనా రాజీనామా లేఖ లేదని అంటున్నారు. ఆగస్టు 5న త్రివిధదళాధిపతుల సమక్షంలో జాతి నుద్దేశించిన ప్రసంగంలో హసీనా రాజీనామా చేశారని.. తాను ఆమోదించానని అధ్యక్షుడు



చెప్పారు. ఇప్పుడు మాత్రం తనవద్ద ఆ లేఖ లేదని చెబుతున్నారు" అని చెప్పారు. ఇదిలాఉంటే, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలతో బంగ్లాదేశ్ ఇటీవల అట్టుడుకిపోయింది. అవి హింసా త్మకంగా మారడం, దాదాపు 300 మంది నిరసన కారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలో షేక్ హసీనా అధికార నివాసాన్ని ఆందోళన కారులు ముట్ట డించారు. దీంతో ఆగస్టు 5న దేశాన్ని వీడిన హసీనా.. భారత్‌కు వచ్చి ఆశ్రయం పొందారు. అనంతరం బంగ్లాలో కొత్త ప్రభుత్వం ఏర్పడి.. పరిస్థితులు కుదుట పడుతోన్న సమయంలోనే హసీనా రాజీనామా గురించి అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు మరోసారి ఆందోళనలకు కారణమయ్యాయి.

## చిలుకమ్మ పలుకులు




విజయానికి తొలి అడుగు
మదిని ఆత్మవిశ్వాసము
విజ్ఞానం మన గొడుగు
చేయు బ్రతుకు సురక్షితము
మనసును చేస్తే అదుపు
మన జీవితాల్లో గెలుపు
ఖచ్చితంగా ఉండదు
ఏమాత్రమూ కుదుపు
జీవితమే పోరాటము
అంతులేని ఆరాటము
అనుక్షణం ఆటుపోట్లు
అధిగమిస్తే విజయము
క్షమాగుణమే ముఖ్యము
పారిపోవు శత్రుత్వము
మనసు మనసు కలిసిపోయి
వర్ధిల్లు ఐకమత్యము

-గద్వాల సోమన్న

9966414580

## వయనాడ్‌లో నామినేషన్ వేసిన ప్రియాంకాగాంధీ

**వయనాడ్:** కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. దానిలో భాగంగా బుధవారం ఆమె నామినేషన్ వేశారు. తల్లి సోనియా గాంధీ, సోదరుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ సీనియర్ నేతలు వెంట రాగా ఆమె నామినేషన్ పత్రాలు సమర్పించారు. "నేను 17 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు తొలిసారి నా తండ్రి కోసం ప్రచారంలో పాల్గొన్నాను. 35 ఏళ్ల నా రాజకీయ జీవితంలో నా తల్లి, సోదరుడు, నా తోటి నేతల కోసం ప్రచారంలో పాల్గొన్నాను. కానీ నాకోసం ప్రచారంలో పాల్గొనడం ఇదే తొలిసారి. వయనాడ్‌లో యూడీఎఫ్ అభ్యర్థిగా పోటీచేస్తున్న నాకు మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, నా కుటుంబానికి కృతజ్ఞతలు. మీరు అవకాశం ఇస్తే.. మీకు ప్రాతినిధ్యం వహించడాన్ని నేను గౌరవంగా భావిస్తాను" అని ఆమె వెల్లడించారు. కొద్దినెలల క్రితం వయనాడ్‌లో కొండచరియలు బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆ ప్రకృతి విపత్తులో 400 మంది ప్రాణాలు కోల్పోగా.. పలువురు ఇళ్లు వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాల్సి వచ్చింది. "నా కళ్లతో ఆ వినాశనాన్ని చూశాను. కుటుంబాలను కోల్పోయిన పిల్లల్ని చూశాను. పిల్లల్ని కోల్పోయిన తల్లుల్ని కలిశాను. సర్వస్వం కోల్పోయిన కుటుంబాలతో మాట్లాడాను. ఇంత కష్టంలోనూ ఒకరికొకరు సహకరించుకోవడం నన్ను ఆశ్చర్యపర్చింది. ఇలాంటి వ్యక్తుల మధ్య నేను భాగం కావడం గొప్ప గౌరవం" అని అన్నారు. ఈ సందర్భంగా తన సోదరిని ఉద్దేశించి ఎంపీ రాహుల్ గాంధీ మాట్లాడారు. "వయనాడ్‌కు ఇద్దరు ఎంపీలు ఉంటారు. ఒకరు అఫీషియల్, మరొకరు అనఫీషియల్. ఈ ఇద్దరు లోక్‌సభలో మీ సమస్యలను లేవనెత్తుతారు" అంటూ ప్రియాంక విజయంపై ధీమా వ్యక్తం



చేశారు. వయనాడ్‌లో 2019 లోక్‌సభ ఎన్నికల్లో సీపీఐ నేత పీపీ సునీర్‌పై 4.3లక్షల మెజార్టీతో రాహుల్ గాంధీ విజయం సాధించారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్ నుంచి పోటీ చేసిన రాహుల్ గాంధీ.. సీపీఐ నాయకురాలు అన్నీ రాజాపై 3.6లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాహుల్ రాజీనామాతో జరుగుతోన్న ఉప ఎన్నికలో ప్రియాంకను ఐదు లక్షల మెజార్టీతో గెలిపిస్తామని రాష్ట్ర కాంగ్రెస్ ధీమా వ్యక్తం చేసింది. కేరళలో పాలక్కాడ్, చెలక్కర అసెంబ్లీ స్థానాలతోపాటు వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక నవంబర్ 13న జరగనుంది. నవంబర్ 23న ఫలితాలు వెల్లడి కానున్నాయి.

పామూరు లో కుక్కల బెడద నివారించాలని పంచాయితీ

## కార్యదర్శి కి వినతి పత్రం అందజేసిన టిడిపి శ్రేణులు



**పామూరు అక్టోబర్ 23 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలో కుక్కల బెడద ముప్పు నుంచి పట్టణ ప్రజలను కాపాడాలని బుధవారం పంచాయతీ కార్యదర్శి గంగిరెడ్డి అరవింద మేడం కు టిడిపి శ్రేణులు వినతి పత్రం అందజేశారు. పామూరు పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అరవింద మేడం దృష్టికి టిడిపి శ్రేణులు తీసుకెళ్లారు. వీధి కుక్కలు పగలు రాత్రి లేకుండా రోడ్లమీద గుంపులుగా తిరుగుతూ, పిల్లలు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయని ఒంటరిగా వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఆమె కుక్కల బెడద లేకుండా చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ సభ్యులు ఉప్పలపాటి హరిబాబు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ నరసింగు సాంబశివరావు, మెంట నరసింహారావు, పందిటి హరీష్, తదితరులు వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

## శ్రీ దుర్గమ్మ సన్నిధిలో కేంద్ర మంత్రి కింజరపు రామమోహననాయుడు



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలోశ్రీ అమ్మవారి దర్శనార్థం ఆలయమునకు విచ్చేసిన గౌరవనీయులైన కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరపు రామ మోహన్ నాయుడు కి ఘన స్వాగతం పలికారు. వీరితో పాటుగా విజయవాడ ఎంపి కేశినేని చిన్ని(శివనాథ్), అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ అమ్మవారి ని దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించి, వేదపండితులచే వేదాశీర్వచనం కల్పించిన ఆలయ ఈవో కె ఎస్ రామరావు వీరికి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదములు మరియు చిత్రపటం ఈ ఓ అందజేశారు. కార్యక్రమంలో ఈవో తో పాటుగా డిప్యూటీ ఈవో ఎం. రత్న రాజు , వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రెవెన్యూ, ఇంజనీరింగ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం

### విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల నూతన భవనంలో ఉన్న మీటింగ్ హాల్లో రెవెన్యూ మరియు ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నగర అభివృద్ధి కోసం విజయవాడ నగరపాలక సంస్థ వారు వరద ప్రభావితం కాని ప్రాంతాలలో గల ఖాళీ స్థలాల, ఆస్తి మరియు ఇతర పన్నుల అంశాలపై చర్చించారు నూతన భవనాలు, ఫ్లోర్లు, ఏమేమి ఉన్నాయో రెవెన్యూ అధికారులు పర్యటించి ఎప్పటికప్పుడు చూసుకోవాలని అన్నారు. నీటి పన్ను అంశంపై రెవెన్యూ మరియు ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలిగించకుండా చూసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ ) జి సృజన, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీ సామ్రాజ్యం , అసిస్టెంట్ కమిషనర్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, ఇతర ఇంజనీరింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ కార్యకర్త కుటుంబానికి బుద్దా వెంకన్న ఆర్థిక సాయం



**విజయవాడ పశ్చిమ, అక్టోబర్ 23,( వార్తా ప్రభ ప్రతినిధి):** స్థానిక భవానిపురం బాల భాస్కర్ నగర్ నందు నివసిస్తున్న పెనుబోతుల రాంబాబు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. బుధవారం రాంబాబు కుటుంబ సభ్యులకు పశ్చిమ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ద్వారా తెలుగుదేశం 40 వ డివిజన్ అధ్యక్షులు చిన్న సుబ్బయ్య ఆధ్వర్యంలో 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం 52 వ డివిజన్ అధ్యక్షులు ఈగల సాంబ శివరావు ,డివిజన్ ఉపాధ్యక్షులు గాడు గణేష్, ఐటీడీపీ కన్వీనర్ గంగవరపు సురేష్ ,బూత్ ఇంచార్జ్ నారాయణరావు, ప్రసాద్ ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# డ్రోన్ టెక్ నవ ఆవిష్కరణలకు గొప్ప ముందడుగు

- వచ్చే అయిదేళ్లలో డ్రోన్ టెక్నాలజీ రంగంలో విప్లవాత్మక మార్పులు.
- డ్రోన్ రంగ భవిష్యత్తుపై తయారీదారుల్లో పెరిగిన విశ్వాసం.
- మేధస్సుకు కొదవ లేదు.. పెట్టుబడుల పరంగా సవాళ్లు-
- డ్రోన్ రంగ స్కిల్ డెవలప్‌మెంట్‌పైనా ప్రత్యేక దృష్టి
- అమరావతి డ్రోన్ సమ్మిట్-2024లో వక్తల అభిప్రాయాలు.
- విజయవంతంగా ముగిసిన రెండు రోజుల సదస్సు.
- సదస్సు విజయవంతానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తరఫున ధన్యవాదాలు తెలియజేసిన రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్, ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్.







**విజయవాడ, అక్టోబర్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)**డ్రోన్ టెక్నాలజీ రంగంలో దేశానికి దశ దిశను నిర్దేశించేలా గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతకు అనుగుణంగా, రాష్ట్రాన్ని దేశ డ్రోన్ రాజధానిగా మార్చాలనే ఆయన ఆకాంక్షకు అనుగుణంగా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్స్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన అమరావతి డ్రోన్ సమ్మిట్-2024 బుధవారం విజయవంతంగా ముగిసింది.డ్రోన్ టెక్ నవ ఆవిష్కరణలకు ఈ సదస్సు గొప్ప ముందడుగు అని, వచ్చే అయిదేళ్లలో ఈ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయని సదస్సులో పలువురు వక్తలు స్పష్టం చేశారు. సదస్సుతో డ్రోన్ మ్యానుఫ్యాక్చర్లలో విశ్వాసం ఇనుమడించిందని.. ఈ ఊపుతో పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ), డ్రోన్ యూజ్ కేసుల రూపకల్పన, వివిధ రంగాల్లో వినియోగం తదితరాల్లో గణనీయ అభివృద్ధి సాధ్యపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యువ భారత్‌లో మేధస్సుకు కొదవలేదని.. అయితే పెట్టుబడుల పరంగా సవాళ్లు ఉన్నాయని.. వాటిని ఎదుర్కొనేలా, స్టార్టప్‌లను ప్రోత్సహించేలా ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయన్న భరోసా సదస్సు ద్వారా లభించిందని పేర్కొన్నారు.

**సవాళ్లను ఎదుర్కొనేలా మేధోమథనం:**మంగళవారం గౌరవ ముఖ్యమంత్రి.. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో కలిసి ప్రారంభించిన అమరావతి డ్రోన్ సమ్మిట్‌లో రెండో రోజు బుధవారం డ్రోన్ రంగ నిపుణులు, ప్రభుత్వ అధికారులతో కూడిన ప్యానళ్లు విస్తృతంగా చర్చించాయి. ఐఐటీ మద్రాస్ డిఫెన్స్ డ్రోన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ హెచ్ఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో వార్‌ఫేర్ విత్ ఇండీజినస్ డ్రోన్ అండ్ యాంటీ డ్రోన్ టెక్నాలజీస్‌పై ప్రభావవంతమైన చర్చ జరిగింది. అదే విధంగా హంచ్ మొబిలిటీకి చెందిన అమిత్ దత్తా నేతృత్వంలో భారతీయ డ్రోన్ రంగంలో పెట్టుబడుల పరంగా సవాళ్లపై చర్చ జరగ్గా.. రెడ్వింగ్ ల్యాబ్స్ కో-ఫౌండర్ అన్షుల్ శర్మ ఆధ్వర్యంలో ఆరోగ్య రంగంలో ఏరియల్ మెడికల్ సపోర్ట్, డ్రోన్ అంబులెన్సులు తదితరాలపై చర్చ జరిగింది. రాష్ట్ర ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి జె.నివాస్, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ అండ్ ఎండీ డా. జి.లక్ష్మీశ చర్చల్లో పాల్గొన్నారు. డ్రోన్ టెక్నాలజీస్ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరవేయడంలో, డ్రోన్ సాంకేతికతల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. స్టార్టప్‌లకు ఫండింగ్‌కు సంబంధించి అమలవుతున్న విధానాలను వివరించారు. అదే విధంగా మారుమూల గ్రామాల ప్రజలు, గిరిజన ప్రాంతాల ప్రజలకు సైతం నాణ్యమైన వైద్యసేవలు అందించడంలో డ్రోన్ సాంకేతికతల అనుసంధాన సాధ్యాసాధ్యాలపైనా చర్చించారు. డిజిటల్ భూ రికార్డుల రూపకల్పనలో డ్రోన్ సాంకేతికత వినియోగంపై ప్రకాశం జిల్లా జేసీ రోణంకి గోపాలకృష్ణ కీలక ప్రసంగం చేశారు. డ్రోన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ స్మిత్ షా నేతృత్వంలో డ్రోన్ రంగానికి అవసరమైన నైపుణ్యవంతులైన మానవ వనరుల అభివృద్ధిపై చర్చ జరిగింది.ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఛైర్మన్, ఎండీ కె.దినేష్ కుమార్.. ఇటీవల విజయవాడ వరదల సమయంలో బాధితులకు ప్రభుత్వం అందించే సహాయక చర్యల్లో డ్రోన్ల వినియోగం విజయవంతం కావడంపై కీలక పీపీటీని ప్రజెంట్ చేశారు. విపత్తుల నిర్వహణలో డ్రోన్ సాంకేతికతపై దార్శనికతను ఆవిష్కరించారు. వరద మ్యాపింగ్, పర్యవేక్షణ, ముంపు నష్టాల సత్వర అంచనా, ఆహారం, ఇతర సామగ్రి సరఫరా, పారిశుద్ధ్య కార్యకలాపాల్లో డ్రోన్లను వినియోగించిన తీరును వివరించారు. 437 డ్రోన్లు, 846 మంది సిబ్బంది, 4,073 ట్రిప్పుల ద్వారా ప్రజలకు అందించిన సేవలను వివరించారు.

**ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు:** ముఖ్యమంత్రి మార్గనిర్దేశనంతో అమరావతి డ్రోన్ సదస్సు-2024ను విజయవంతం కావడంలో భాగస్వాములైన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్, ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో భాగస్వాములైనవారిని ఘనంగా సత్కరించారు.

# అభివృద్ధి సంక్షేమ పథకాలపై కళాకారుల కళాప్రదర్శన

**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 23: (వార్తాప్రభ ప్రతినిధి)** రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యములో ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఎడమల శ్రీధర్ రెడ్డి కళా బృందం కళా ప్రదర్శన ఇచ్చారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు మహిళకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీపథకం 10లక్షల పెంపు, వంట గ్యాసు 500 వరకు అందించడం, అర్హులైన రైతులందరికీ రెండు లక్షల వరకు రుణమాఫీ, రెండు వందల యూనిట్లు ఉచిత కరెంటు, గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకాలు వివరిస్తూ స్వచ్ఛ ధనం పచ్చదనం వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ప్రాణ వాయువును అందించే పచ్చని చెట్లు ప్రతీ ఒక్కరూ వారి ఇంటి ముందర పెంచుకోవాలని, ప్లాస్టిక్ కవర్ వాడకం ఆరోగ్యానికి హానికరమని పేర్కొన్నారు. అలాగే వాన కాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని, కావలసిన జాగ్రతలు తీసుకోవాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛత పాటించి ఈగలు దోమలు వృద్ధి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, మన సిరిసిల్ల జిల్లా దేశంలోనే ప్రథమ స్థానం వుండేలా ప్రజలందరూ సహకరించాలని కోరారు.ప్లాస్టిక్ నిషేధం పచ్చదనం పెంపు స్వచ్ఛ ధనంపై పట్టణ ప్రజలకుపాటల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో సిరిసిల్ల జిల్లా టీమ్ లీడర్ ఎడమల శ్రీదర్ రెడ్డి, కళాకారులు శ్రీరాముల రామచంద్రం, గడ్డం శ్రీనివాస్,గుగ్గిల్ల పర్ష రాములు, వంతడుపుల గణేశ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువలో!!

- ఇక రామగుండంలోనే రిజిస్ట్రేషన్ సర్వీసులు
- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్





**పెద్దపల్లి/ రామగుండం: అక్టోబర్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)**ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువలోకి తీసుకురావడమే లక్ష్యంగా రామగుండం నియోజకవర్గంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్. ఈ మేరకు బుధవారం రామగుండం నగరపాలక సంస్థ 20వ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..... జిల్లా కేంద్రానికి వెళ్లకుండా స్థానికంగానే రిజిస్ట్రేషన్ సర్వీసులు పొందవచ్చని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రామగుండం ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అందిస్తామని అన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్, జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్ కుమార్, రామగుండం రిజిస్ట్రార్ తిరుపతి నాయక్ , నగర మేయర్, కార్పొరేటర్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీటీపీఎస్ లో ఇద్దరు ఏడీఈలు బదిలీ

- మరో ఏడీఈపై దాడికి యత్నించిన, సహకరించిన ఇద్దరిపై వేటు

**ఇబ్రహీంపట్నం, అక్టోబరు 23 (వార్తా ప్రభ ప్రతినిధి):-** ఎన్టీటీపీఎస్ లో అంతర్గత బదిలీని ఆపలేదని అక్కసుతో తోటి ఉద్యోగి, ఇంజనీరింగ్ అసోసియేషన్ నాయకుడిపై దాడికి యత్నించిన ఏడీఈని, అతనికి సహకరించిన మరో ఏడీఈని ఏపీ జెన్ కో అధికారులు బుధవారం బదిలీ చేశారు. ఈ నెల 7న సర్వీసు బిల్డింగ్ లో దాడికి యత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏడీఈ శీధర్ ను సీలేరుకు, అతనికి సహకరించినట్లు ఆరోపణలు ఉన్న ఏడీఈ శ్రీనివాసరావును శ్రీశైలానికి బదిలీ చేస్తూ ఏపీ జెన్ కో ఎండీ చక్రధర్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ ఉల్లంఘిస్తున్న వారికి ఇదో హెచ్చరిక అని పలువురు ఇంజనీర్లు, ఉద్యోగులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

# మందమర్రి పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమం లో పాల్గొన్న విద్యార్థులు



**మందమర్రి అక్టోబర్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి):** పోలీస్ అమరవీరుల స్మరకోత్స వాలలో భాగంగా ఈరోజు మందమర్రి పోలీస్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను, సేవలను స్మరించుకుంటూ అక్టోబర్ 21 నుండి 31 వరకు నిర్వహిస్తున్న పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ .ఎం శ్రీనివాసులు (ఐజి) ఐపీఎస్ , మంచిర్యాల డిసిపి ఏ. భాస్కర్ ఐపీఎస్ . ఆదేశాల మేరకు మందమర్రి పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఓపెన్ హౌస్ లో పోలీస్ స్టేషన్లో ఉండే రిసెప్షన్ వ్యవస్థ, కేసు డైరీలు, హిస్టరీ షీట్స్ ,స్టేషన్ లాకప్, స్టేషన్లో ఉపయోగించే ఆయుధాలు, డయల్ 100 వ్యవస్థ పనిచేయు విధానం,పోలీసు వారి యొక్క ముఖ్య విధులు, పోలీస్ యూనిఫాం, ట్రాఫిక్ రూల్స్, నూతన చట్టాలు మరియు ఇతర అంశాల పైన విద్యార్థులకు అవగాహన కల్పించారు.అదేవిధంగా పోలీసులు రోజువారి విధుల్లో అత్యంత కీలకంగా వ్యవహరించే కమ్యూనికేషన్ విధానం వివరించి విద్యార్థులచే పోలీస్ కంట్రోల్ రూమ్ చేత మాట్లాడించడం జరిగింది. ఓపెన్ హౌస్ కార్యక్రమానికి హాజరైన విద్యార్థిని విద్యార్థులు ఎంతో ఆసక్తి వ్యక్తపరుస్తూ పోలీసు వారితో కలిసి పోలీస్ వ్యవస్థ యొక్క పనితీరు గురించి తెలుసుకొని ఆనందం వ్యక్తపరిచారు.

# లక్కీ బ్యూటీ.. 3 వారాల గ్యాప్ లో 3 సినిమాలు!



మీనాక్షి చౌదరి.. టాలీవుడ్ లో ఇటీవలి కాలంలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు. ప్రస్తుతం ఈ హర్యానా బ్యూటీ చేతి నిండా సినిమాలతో బిజీ బిజీగా గడుపుతోంది. ఓవైపు స్టార్ హీరోల సరసన నటిస్తూనే, మరోవైపు కుర్ర హీరోలకు జోడీగా అలరిస్తోంది. 2024లో ఇప్పటికే 'గుంటూరు కారం', 'సింగపూర్ సెలూన్', 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం(ది గోట్) వంటి చిత్రాలతో సందడి చేసింది. ఇప్పుడు మరో మూడు సినిమాలతో ప్రేక్షకులను పలకరించడానికి రెడీ అయిపోయింది. మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటించిన 3 తెలుగు సినిమాలు ఒకే సీజన్ లో విడుదలకు సిద్ధమయ్యాయి. ముందుగా మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ కు జోడీగా ఆమె నటించిన "లక్కీ భాస్కర్" చిత్రం దీపావళి కానుకగా అక్టోబరు 31న గ్రాండ్ గా రిలీజ్ కాబోతోంది. ఇందులో సావిత్రి అనే మిడిల్ క్లాస్ హౌస్ వైఫ్ క్యారెక్టర్ లో మీనాక్షి కనిపించనుంది. ఇప్పటికే బయటకు వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ తో జనాల దృష్టిని ఆకర్షించింది. మెగా హీరో వరుణ్ తేజ్ సరసన మీనాక్షి చౌదరి కథానాయికగా నటించిన పాన్ ఇండియా చిత్రం "మట్కా". ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామా నవంబరు 14న థియేటర్లలోకి రానుంది. అలానే మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా నటించిన 'మెకానిక్ రాకీ' మూవీలోనూ గార్జియస్ బ్యూటీ హీరోయిన్ పాత్ర పోషించింది. ఇది నవంబరు 22వ తేదీన విడుదల కానుంది. ఇలా మీనాక్షి 3 వారాల గ్యాప్ లో 3 సినిమాలతో ఆడియన్స్ ముందుకు రాబోతుంది. ఒకే సీజన్ లో మూడు సినిమాలు వస్తుండటంతో, మీనాక్షీ ప్రమోషన్స్ తో బిజీ అయిపోయింది. ఒకేసారి మూడు చిత్రాలకు ఈక్వల్ గా టైమ్ కేటాయిస్తూ, ప్రచారం చేస్తోంది. ఆన్ లైన్ ప్రమోషన్స్ తో పాటుగా ఆఫ్ లైన్ ప్రచారం కూడా మొదలుపెట్టింది. దీంతో రాబోయే నెల రోజుల పాటు మీడియాలో, సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా అమ్మడి సందడే కనిపించనుంది. లక్కీ భాస్కర్, మట్కా, మెకానిక్ రాకీ.. ఈ మూడింటిలో ఏ రెండు హిట్టయినా మీనాక్షి కెరీర్ నెక్స్ట్ లెవల్ కు చేరుకునే అవకాశం వుంది. ఫెమినా మిస్ ఇండియా హర్యానా టైటిల్ గెలుచుకున్న అందాల మీనాక్షి చౌదరి.. ఫెమినా మిస్ ఇండియా-2018 %ద% మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్-2018 అందాల పోటీలలో ఫస్ట్ రన్నరప్ గా నిలిచింది. ఆ తర్వాత 'అప్‌స్టార్ట్స్' అనే హిందీ సినిమాలో చిన్న పాత్రలో మెరిసింది. 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' చిత్రంతో టాలీవుడ్ లో హీరోయిన్ గా అడుగుపెట్టింది. ఖిలాడి మూవీ ఫ్లాప్ అయినా, 'హిట్ 2' చిత్రం మంచి హిట్ ఇచ్చింది. మీనాక్షి చౌదరి ప్రస్తుతం విక్టరీ వెంకటేశ్ తో కలిసి 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో నటిస్తోంది. ఇందులో ఆమె ఒక పోలీస్ గా, వెంకీ మామా ఎక్స్ గర్ల్ ఫ్రెండ్ గా కనిపించనుంది. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాని వచ్చే సంక్రాంతి పండక్కి రిలీజ్ చేస్తారా లేదా? అనే విషయం మీద క్లారిటీ రావడం లేదు. ఇక మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న 'విశ్వంభర' చిత్రంలో మీనాక్షి కీలక పాత్ర పోషిస్తోందని టాక్ వినిపిస్తోంది.

# అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తూ, ప్రజా సమస్యలు పరిష్కరించండి

జిహెచ్ఎంసి అధికారులకు కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి వినతి



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 23 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ,గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి బుధవారం జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి ని,డిప్యూటీ కమిషనర్ ముకుంద్ రెడ్డి ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి వినతి పత్రం సమర్పించారు.అనంతరం జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి తో సమావేశమై గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నేతాజీ నగర్,రాయదుర్గం,మంజీర డైమండ్ హిట్స్,నల్లగండ్ల హుడా కాలనీ,నానక్ రామ్ గుడా లలో సీసీ రోడ్లు దెబ్బ తినడం వల్ల చిన్న పాటి వర్షానికి గుంతలలో నీరు నిలిచి స్థానిక ప్రజలు రాకపోకలకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని తక్షణమే నూతన రోడ్లు వేయించాలని అలాగే గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని జనాభా దృశ్య రోడ్డు వెడల్పు కూడా చేయవలసిన అవసరం ఉందని కార్పొరేటర్ జోనల్ కమిషనర్ ని కోరడం జరిగింది.గచ్చిబౌలి డివిజన్ విస్తారమైన ప్రాంతం కాబట్టి, ఇక్కడ అన్ని రాష్ట్రాల ప్రజలు నివసిస్తారని,స్థానికుల మౌలిక వసతుల కోసం తగిన నిధులు మంజూరు చేయవలసిందిగా కార్పొరేటర్ జోనల్ కమిషనర్ కి కోరడం జరిగింది.దీనికి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించడం జరిగింది.అనంతరం డిప్యూటీ కమీషనర్ ముకుంద్ రెడ్డి తో సమావేశమై గచ్చిబౌలి డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలపై,చేపట్టవలసిన అభివృద్ధి పనులపై,కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా చర్చించారు గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి.పెండింగులో ఉన్న పనులను వెంటనే ప్రారంభించి త్వరిత గతిన పూర్తయ్యేలా చూడాలని డిప్యూటీ కమీషనర్ ముకుంద్ రెడ్డి ని కార్పొరేటర్ కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అలోక్,అతుల్, మోహిత్,రాకేష్,రాజీవ్ తదితరులు పాల్గొన్నారు

# అభాగ్యులకు పేద వర్గాలకు పెన్నిధిగా ముఖ్యమంత్రి సహాయనిధి - శాసనసభ్యులు అరికెపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 23 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన 1,20,000/- ఒక లక్ష ఇరవై వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబాలకి అందచేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పీఏసీ చైర్మన్ గాంధీ పునరుద్ఘాటించారు . అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని,అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు,అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని.. పీఏసీ చైర్మన్ గాంధీ ఈ సందర్భంగా తెలియచేశారు.ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధితుల కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, నాయకులు నాయి నేనీ చంద్రకాంత్ రావు,ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్,బ్రిక్ శ్రీనివాస్,పోతుల రాజేందర్, ఇబ్రహీం,అనిల్, సాంబయ్య, శ్రీహరి,పద్మ మరియు తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన..

మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్..
మేయర్ శాంతి కోటేష్ గౌడ్,డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్.





**జవహర్ నగర్ అక్టోబర్, 23:(వార్తా ప్రభ)** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 20వ డివిజన్ లో 15 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మేడ్చల్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్. స్థానిక కార్పొరేటర్ కుతాడి సాయికుమార్ డివిజన్ లో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి మేయర్ డిప్యూటీ మేయర్ ల దృష్టికి తీసుకువెళ్లి, తోటకూర వజ్రేష్ యాదవ్ చేతుల మీదుగా మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ ల సమక్షంలో 20వ డివిజన్ భాగ్యనగర్, జై రామ్ నగర్ మరియు దేవేందర్ నగర్ లలో 15లక్షల మున్సిపల్ నిధులతో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ రెడ్డి జవహర్ నగర్ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు సతీష్ గౌడ్, కార్యకర్తలు, కాలనీవాసులు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

● మూల్పూరి సాయి కళ్యాణి, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



**హనుమాన్ జంక్షన్,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** పట్టబద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మూల్పూరి సాయి కళ్యాణి కోరారు. గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు బుధవారం నాడు ఇంటింటికి వెళ్లి పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని సాయి కళ్యాణి చెప్పటారు. ఈసందర్భంగా సాయి కళ్యాణి మాట్లాడుతూ, కూటమి అభ్యర్థి, మాజీ మంత్రివర్యులు, ఆలపాటి రాజేంద్రప్రసాద్ చాలా కాలంగా రాజకీయాల్లో ఉండటమే కాకుండా ఎన్నారై విద్యాసంస్థలను కూడా నడుపుతున్నారు. స్కూళ్లు, కాలేజీలతో ఎంతోమంది భావిపౌరుల్ని తీర్చిదిద్దారు. పట్టభద్రుల ఓట్ల నమోదుపై 1, నవంబర్ 2021 సంవత్సరానికి డిగ్రీ పూర్తయిన ప్రతి ఒక్కరు పట్టభద్రుల ఓటర్ నమోదుకు అర్హులేనని సాయి కళ్యాణి తెలిపారు. డిగ్రీ ప్రావిజినల్ జిరాక్స్, ఆధార్ జిరాక్స్, ఓటర్ ఐడి జిరాక్స్, కలర్ ఫోటోతో ఓటును నమోదు చేసుకోవాలని పట్టభద్రులకు సాయి కళ్యాణి సూచించారు. ఓటు ఎంతో విలువైనదని బిఏ, బీకాం, బీఎస్సీ, బీటెక్, ఎల్.ఎల్.బి, ఎంబీబీఎస్ ఏదైనా డిగ్రీ పూర్తయి మూడు సంవత్సరాలు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవచ్చని కళ్యాణి తెలిపారు.

# దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చడానికి కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారు - పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ డా పూర్ణచంద్ర రావు




**విజయవాడ,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** అనాదిగా దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాల్లో కలపడానికి జరుగుతున్నా పోరాటాలను ప్రభుత్వాలన్నీ కమిటీలు, కమిషన్ల పేరుతో నిర్వీర్యం చేస్తున్నా యని, మునుపటిలాగానే ఈ ఉద్యమా నికి బహుజన్ సమాజ్ పార్టీ పూర్తి మద్దతు తెలుపుతూనే ఉంటుందని రిటైర్డ్ డీజీపీ మరియు బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ డా పూర్ణచంద్ర రావు అన్నారు. బుధవారం, విజయవాడలో క్రిస్టియన్ కోఆర్డినేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో, దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తించాలనే డిమాండ్ పై జరిగిన రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో అయన ప్రసంగిస్తూ బీఎస్పీ దీనిపై ముమ్మందు ఉద్యమాలకు, ప్రజాపోరాటాలకు ఉద్యుక్తులవుతుందని చెప్పారు. "నాడు డాక్టర్ బి.ఆర్ అంబెద్కర్ పుణ్యమాని ఎస్సీ, ఎస్టీలకు రేజర్వేషన్ల కల్పన జరిగిందని కానీ, శతాబ్దాలుగా అవమానాలకు, నిర్లక్ష్యానికి కులమనే వెలికి బలైన దళితులు క్రైస్తవులుగా మారినా వారికి జరుగుతున్న మంచి ఏమీ లేదు. అటు మతం అనేక విధాలుగా కులవివక్షకు గురవుతూనే వస్తూ కులమనే ముద్ర నుండి బయటపడలేని వీరికి ప్రభుత్వాలు కూడా రిజర్వేషన్లు కల్పించబోము అంటూ మోసం చేయడం వలన వీరి బతుకులు మరింత దుర్భరంగా మారాయి. దశాబ్దాలుగా వస్తున్నా ఈ డిమాండ్ పై కమిటీలు ఇక పనిచేయబోవు అని ఆయన అన్నారు. ఇక పోరాటాలే మార్గమని అయినా కూడా బీఎస్పీ సంయమనం పాటిస్తూ రేపు ఆంధ్రప్రదేశ్ లో పర్యటించబోయే బాలకృష్ణన్ కమిషన్ ముందర తమ వైఖరి స్పష్టం చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ శ్రీ సామ్యూల్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ దళితులు క్రైస్తవుల్లా మారినా కూడా వారికీ ఎన్నో విధాలుగా అవమానాలు జరుగుతూనే ఉన్నాయని. అగ్ర కులాల నుండి వచ్చిన ఆర్చిబిషప్ల నుండి పాస్టర్ల వరకు దళితులను అంటరానివారిగా చూస్తూనే ఉన్నారని. మరిక్కడ కూడా కుల వివక్ష ఎదురొకుంటుంటే కులాన్ని మా మీద రుద్దుతున్నది ఎవరు అని ప్రశ్నించారు. అందుకే మేము ఢిల్లీ వరకు వెళ్లి మా మనుగడ, బాగుకోసం ఎస్సీ స్టేటస్ డిమాండ్ చేశామని. ఈ సర్కారు నుండి మాకు ఎటువంటి ఆశ లేకపోయినా మేము పోరాడుతూనే ఉంటామని, మా పోరాటానికి మద్దత్తు తెలిపిన బీఎస్పీ పార్టీకి ధన్యవాదాలు. ఆయన తెలిపారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బక్క పరంజ్యోతి మాట్లాడుతూ," దళిత క్రైస్తవుల ఆవేదన బీఎస్పీ పూర్తిగా అర్థం చేసుకున్నాడని, వారికీ మరింత బలంగా మద్దత్తు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ కె. బాబురావు ఐపీఎస్ అడిషనల్ డీజీ రెవ డా దయాపాత ఏ ఐ సి సి (ప్రెసిడెంట్, తమిళనాడు), డా తెన్నేటి జయరాజు (ప్రముఖ రచయిత), కె. శాంతి సాగర్ బిషప్ (ఇండిపెండెంట్), రెవ కరణం తిరుపతిరావు (హైకోర్ట్ అడ్వకేట్), బొక్కా జార్జిము నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు), మరియు రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన పాస్టర్లు, మతగురువులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.

# తేన్నేరు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి



**కంకిపాడు,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** తెన్నేరు రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి. రంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తేన్నేరు రోడ్డుపై నిర్మాణ పనులు చేపట్టాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ కోమటిగుంట లాకు నుండి, తేన్నేరు వరకు గల నాలుగు కిలోమీటర్ల రహదారి మొత్తం గుంట లమయిమై, ఆటోలు, బైకులు, సైకిళ్లు రోడ్డు మీద వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి వచ్చిందన్నారు. తే న్నేరు నుండి గుడివాడ, విజయవాడ, కంకి పాడు వెళ్లటానికి, కోమటికుంట లాకు, క్రిస్టియన్ పేట, జగన్నాధపురం, ప్రాంతాల నుండి తెన్నేరు రైల్వే స్టేషన్ కు వెళ్లటానికి, నిత్యం వందలాదిమంది ప్రయాణం చేస్తున్న రోడ్డు వర్షాకాలంలో గుంటలలో నీకు నిలబడి, రోడ్డు కనపడకపోవడం వలన అనేక ప్రమాదాలు జరిగి మనుషులకు గాయాలవటం, వాహనాలు దెబ్బ తినటం పరిపాటుగా మారిందన్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే నరకయాతన పడుతున్నారు. వృద్ధులు, మహిళలు రోడ్డు మీదకి రావాలంటేనే భయపడే పరిస్థితి. రైతులు, కౌలు రైతులు తమ పంట ఉత్పత్తులు, పచ్చగడ్డి, ఎరువులు లాంటివి నిత్యం ఈ రోడ్లమీద తీసుకుని వెళ్ళవలసిన అవసరం ఉంది, వ్యవసాయ కూలీలు ఈ రహదారిలో పొలాలకు రావాలంటేనే ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ రోడ్డు నిర్మాణం చేయాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని అయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి టి. నరేష్ మండలకమిటి సభ్యులు, . శ్రీహరి, రవి, పార్టీ సభ్యులు యేసు, బెనర్జీ, సుందరం, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# నియోజక వర్గ ఎమ్మెల్యే కి బహిరంగ లేఖను విడుదల చేసిన బి ఎ స్పీ ఎం పీ టీ సీ బర్రె, ఉదయ్ కిరణ్



**కంచికచర్ల,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** కంచికచర్ల పట్టణం లోని జుజ్జూరు రోడ్డు నిర్మాణ విషయంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మొసలి కన్నీరు కార్చిన తంగిరాల సౌమ్య, మరియు టిడిపి నాయకులు అధికారం వచ్చిన తర్వాత ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారో సమాధానం చెప్పాలని బీఎస్పీ నందిగామ నియోజకవర్గ ఇన్చార్జ్, కంచికచర్ల ఎంపిటిసి బర్రె ఉదయ్ కిరణ్ స్థానిక ఎమ్మెల్యే కి ఈరోజు బహిరంగల్ లేఖను విడుదల చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురి కాబడిన జుజ్జూరు రోడ్డు తాము అధికారంలోకి వచ్చిన పిమ్మట యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తామని హామీ ఇచ్చి నేడు ఏమి పట్టనట్లు గా అధికార టిడిపి,మహాకూటమి ప్రభుత్వాలు గాఢ నిద్రలో ఉన్నాయని వెంటనే మేల్కొని ప్రజల యోగక్షేమాలు పట్టించుకోవాలని తెలిపారు

# కలల సహకారంకు తొలివిఘ్నం మెరువమట్టి మలివిఘ్నం ప్లాస్టింగ్ ఇసుక





**విస్సన్నపేట,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** సొంత ఇంటి కలల సహకారంకు ఏపీ ప్రభుత్వం అందిస్తున్న అనుమతులతో పనిలేని టాక్టర్ తో ఇసుక ఫ్రీ పథకం బాగున్న మేరువా మట్టి లేకుంటే ఇంటి నిర్మాణం ప్రారంభం కాదన్న సంగతి సర్వత్రా తెలిసిందే.మేరువా మట్టి లేకుండా గృహ నిర్మాణాలు జరిగే పరిస్థితి లేదు.భవన నిర్మాణ కార్మికులు వారి జీవనం ముందుకు వెళ్లాలంటే తొలుత గృహ నిర్మాణ సంబంధిత భూమి చదనం మరియు మేరువ తోనే కార్యక్రమం ప్రారంభమవుతుంది. పునాదులలో మట్టినింపకుండా భవన నిర్మాణం అసలు సాధ్యం కాదు. అలాంటప్పుడు మేరువా మట్టికి రెవెన్యూ అనుమతులు ఇవ్వకుండా నిర్మాణాలకు ఇసుక అందుబాటులో తెచ్చిన ఉపయోగం లేదు. కొన్ని ప్రాంతాలలో ఉన్న ఇసుక కట్టుడు పనులకు మాత్రమే పనికి వస్తుంది ప్లాస్టింగ్ లకు పనికి వచ్చే పరిస్థితి ఉండదు. అలాంటి సమయంలో ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న వారు కూడా గోదావరి ఇసుకపై ఆధారపడటం జరుగుతుంది. వేలాదిమంది భవన నిర్మాణ కార్మికులు ప్లాస్టింగ్ ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణాలు ఆగిపో యి ఖాళీగా ఉండటం జరుగుతుంది. ఆరు నెలలగా నిర్మాణాలు నిలిచిపోవడంతో పనులు లేక కాపీ వర్కర్స్ పెయింటింగ్ కార్పెంటర్ ప్లంబర్ ఎలక్ట్రీషియన్స్ తదితర నిర్మాణాల కార్మికులు ఏమీ చేయలేని స్థితిలో ఉన్నారని తెలుస్తోంది. సొంత ఇంటి కలల సహకారం కొరకు మన్నికైన ముడిసరుకుతో ఇంటి నిర్మాణాలు చేసుకునేందుకు తొలుత మేరువా మట్టి అందుబాటు లేకపోవడం తొలివిఘ్నం అయితే మలి విఘ్నం గా ప్లాస్టింగ్ ఇసుక ఫ్రీ కాకపోవటంతో భవన నిర్మాణ కార్మికులతో పాటు గృహాల యజమానులు అనుమతులు కొరకు ఎదురుచూసే పరిస్థితులలో ఉన్నట్లుగా విశ్వసనీయ వర్గాల సమాచారం అందుతుంది.

# ముత్తు పదార్థాల జోలికి యువత వెళ్లవద్దు - మెరైన్ సీఐ సురేష్ రెడ్డి



**కోడూరు,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** సమాజం పట్ల యువత బాధ్యతాయు తంగా ఉండాలని మెరైన్ సీఐ సురేష్ రెడ్డి అన్నారు. పాలకయతిప్ప కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సమాజాన్ని పట్టిపీడిస్తున్న గంజాయి, ముత్తు పదార్థాల వాడకం వంటి వాటిపై అవగాహన కార్యక్రమాలను స్వతం త్ర పురం జిల్లా పరిషత్ హై స్కూల్, శ్రీ కోట రాఘవయ్య విద్యా సంస్థల నం దు నిర్వహించారు. సిఐ సురేష్ రెడ్డి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. వాహనాలు నడిపేటప్పుడు నెమ్మదిగా నడపాలని తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో మెరైన్ ఎస్ఐలు ఉజ్వల్, జిలాని, ప్రధానోపాధ్యాయులు ఆల వెంకటరమణ, రైటర్ రెహమాన్ జానీ,అనిల్ కుమార్, జగన్, కరుణ తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# కంచే చేను మేస్తే ఎలా?

●హోం మంత్రిని కలవనున్న తల్లి కొడుకులు



**విస్సన్నపేట,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** తన కుమారుని పెళ్లికి సంబంధించి 20 20 సంవత్సరంలో విడాకుల విషయంలో పెద్దలను ఆశ్రయించామని రాజీ ఒప్పందం జరిగిందని కొర్లమడ గ్రామానికి చెందిన కట్ట పద్మావతి మీడియా సమావేశంలో తెలియజేశారు. రాజీ అయిన తర్వాత కూడా ఆరు కాసుల బంగారం గ్రామ పెద్దలు ఆనాటి నుండి ఈనాటి వరకు తమ వద్ద ఉంచుకొని మీనమేషాలు లెక్కిస్తున్నారని ఈ విషయమై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ను కలిసి తమ గోడును వినుమించుకోనున్నట్లు ఆమె తెలిపారు.

# ఆర్డీవో మాధురిని సన్మానించిన టిడిపి నేత నెక్కలపు శ్రీనివాసరావు



**విస్సన్నపేట,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని కొర్లమండ గ్రామంలో గ్రామ సభ కార్యక్రమంలో ఆర్ డి ఓ కే మాధురి పాల్గొన్నారు. మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగే ఈ కార్యక్రమంలో రీ సర్వే భూ సమస్యలపై ప్రజలు అర్జీలు అందించారు. గతంలో సమాచారం లేకుండా సర్వే జరిగిందని రేపు ఉదయం వస్తానని ముందు రోజు సాయంత్రం సర్వే సిబ్బంది ఫోన్ చేసే వారని సమయపాలనలేదని కొందరు రైతులు ఆరోపించడం జరిగింది.ఆర్డిఓ మాట్లాడుతూ గతంలో వలె తప్పులు జరగవని పర్ఫెక్ట్ గా ప్రతి ఒక్క రైతన్నకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం ఉన్నదని ఒక్క చిన్న తప్పు కూడా జరగకుండా రీసర్వే జరిగే విధంగా ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. టిడిపి నాయకులు శ్రీనివాసరావు నెక్కలపు ఆర్డిఓ మాధురికి పట్టు శాలువా ఫ్లవర్ బొకేలతో ఘన సన్మానం చేశారు. తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు కే రాజా, జి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నమ్మకం ఉంటే ఏ అవరోధాలు విజయాన్ని ఆపలేవు

● విద్యావేత్త , సిఎస్ బి ఐఏఎస్ అకాడమీ అధినేత్రి ఎం.బాలలత.



**చల్లపల్లి/అవనిగడ్డ,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** మరో వ్యక్తి సాధించగలిగింది ఏదైనా మనం కూడా సాధించగలమనే నమ్మకం మనలో ఏర్పడితే ఎలాంటి అవరోధాలు మన విజయాన్ని అడ్డుకోలేవని ప్రముఖ విద్యావేత్త,సిఎస్ బి ఐఏఎస్ అకాడమీ అధినేత్రి, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఎం.బాలలత అన్నారు. బుధవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో విజయ జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. వివేకానంద డిగ్రీ కళాశాల, విజయ జూనియర్ కళాశాలల డైరెక్టర్ అండ్ కర్పస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ – లక్ష్యాల సాధన అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బాలలత మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన ఆశయాలు ఆలోచనలతో మంచి స్థాయికి చేరుకోవాలని కోరారు. మనిషిగా పుట్టడమే అదృష్టమైతే కలలు కనడం మరో అదృష్టమని మనలోని అపారమైన శక్తిని నమ్మితే లక్ష్యాన్ని సాధించలేమనేది బలహీనత మాత్రమేనని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు.అలోచనలకు పదునుపెట్టి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తూ ధైర్యం,తెగువతో లక్ష్యాన్ని చేదించవచ్చన్నారు.జీవితంలో జయాపజయాలను సమంగా స్వీకరించే మానసిక ధైర్యం పెంపొందించుకుని సమయపాలన పాటిస్తూ లక్ష్యసాధనకు కృషి చేస్తే అద్భుతమైన విజయం పాదాక్రాంతం అవుతుందన్నారు.ఏ రెండు జీవితాలు ఒకేలా ఉండవని ప్రతిసారి ప్రక్క వారితో పోల్చుకోవడం సరికాదన్నారు.ఏ రంగంలోనైనా విజయాన్ని అందుకున్న విజేతలను ఆదర్శంగా తీసుకుని బద్ధకం,వాయిదావేయడం, ఆత్మనూన్యత,భయం వదిలేసి సమయపాలన పాటిస్తూ కృషిచేసి కలలను సాకారం చేసుకోవచ్చన్నారు. చిన్ననాడు టీకా వికటించి రెండు కాళ్ళు కోల్పోయినప్పటికీ తాను ఉన్నత స్థాయికి ఎదిగిన తీరు వివరించి స్పూర్తి నింపారు. సాధారణ స్థితి నుంచి ఐఏఎస్, ఐపీఎస్ స్థాయికి ఎదిగిన వారి జీవిత గాధలు వివరించి వారి నుంచి స్పూర్తి పొందాలన్నారు. మొబైల్ ఫోన్ విద్యా అనుబంధ అంశాలు, లక్ష్య సాధనకు దోహదం చేసే విషయాలు తెలుసుకునేందుకు వినియోగించుకోవాలని సూచించారు. దినపత్రికల ద్వారా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ అప్డేట్స్ ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని తద్వారా కరెంట్ అఫైర్స్ పై పట్టు సాధించాలని సూచించారు. సమయాన్ని ప్రణాళికతో వినియోగించుకుంటూ కఠోర శ్రమతో పురోగమించి ఉన్నత శిఖరాలు అందుకోవాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ శివప్రసాద్ ,విజయా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ రహీం , వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పెమ్మసాని రమేష్ లు ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సీఐ కే.ఈశ్వరరావు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి ప్రసంగించారు. కార్యక్రమాన్ని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పీ.రమేష్ బాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ రహీం, అధ్యాపకులు పర్యవేక్షించారు.

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతదేహం



**కృత్తివెన్ను,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** మండలంలోని చిన్నగొల్ల పాలెం గ్రామంలో సముద్రపు ఒడ్డున ఒక వ్యక్తి అనుమానాస్పద రీతిలో చనిపోవడం పలు అనుమానాలకు దారి తీస్తుంది. సముద్రపు ఒడ్డున విగత జీవిగా మారిన సదరు వ్యక్తి గురించి వివరాలు సేకరించేందుకుగాను పెడన సి ఐ కే నాగేం ద్రబాబు మరియు బంటుమిల్లి ఎస్ఐ గణేష్ సంఘటన స్థలానికి హుటాహుటిన అచటకు చేరుకోవడం జరిగింది. మరణించిన వ్యక్తి సుందరం సత్యనారాయణ గా గుర్తించటం జరిగిందని, అతని వయసు సుమారు 42 సంవత్సరాలు ఉంటాయని, , కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి అతని భౌతిక కాయాన్ని తరలించడం జరిగిందని పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని ఒక ప్రకటనలో తెలిపారు.

# రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన హై స్కూల్ విద్యార్థినిలు



**కోడూరు,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడా పోటీలకు కోడూరు మండల పరిధిలోని లింగారెడ్డి పాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ చెందిన విద్యార్థినిలు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే నాగ రత్నకుమారి తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జరిగే కబడ్డీ, ఖో ఖో పోటీలకు విద్యార్థినిలు ఎంపికైనట్లు, కబడ్డీ విభాగం లో అండర్ 17లో పి మధుప్రియ, అండర్ 16 ఖో ఖో విభాగంలో బి దివ్య, పి మధు ప్రియ, పి లావణ్య, డి నాంచారమ్మ, బి మహేశ్వరి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులతోపాటు, వ్యాయామ ఉపాధ్యాయులు బిపిఎల్ ప్రసాద్ ను విద్య కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

# హోరా హోరీగా నర్సింగ్ అసోసియేషన్ జిల్లా ఎన్నికలు

● అధ్యక్ష, కార్యదర్శిగా బురిగా విజయ లక్ష్మి, బోడే రాణి

● అభినందించిన ఏపీ ఎన్జీవో సంఘ నాయకులు




**కాకినాడ,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆంధ్ర ప్రదేశ్ నర్సింగ్ అసోసియేషన్ జిల్లా ఎన్నికలు హోరాహోరిగా జరిగాయి. కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో జరిగిన ఎన్నికలలో జిల్లా అధ్యక్షురాలుగా బురిగా విజయలక్ష్మి , ఉపాధ్యక్షురాలుగా బోడే రాణి జిల్లా, జిల్లా కార్యదర్శిగా గట్టు ప్రమోద,జిల్లా కోశాధికారిగా కాకి వెంకట పరమేశ్వరి విజయం సాధించారు. ఐదు కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా మిగిలిన పదవులకు ఎన్నికలు నిర్వహించారు.ఈ ఎన్నికల్లో విజయం సాధించిన వారిని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఏ.పీ.ఎన్జీ.వో . సంఘం అధ్యక్షులు గుద్దటి రామమోహన రావు, జిల్లా కార్యదర్శి పి.వెంక ట కృష్ణ కార్యదర్శి రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసు, ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తి బాబు,సరేళ్ళ చంద్రరరావు,కాకినాడ యూనిట్ అధ్యక్షులు ఎ.సత్తిరాజు శుభాకాంక్షలు తెలిపారు.

# బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

● బాణసంచా అక్రమంగా నిల్వ చేస్తే కఠిన చర్యలు ● పిఠాపురం రూరల్ ఎస్.ఐ ఎల్. గుణ శేఖర్



**పిఠాపురం,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయించే వ్యాపారులు ఫైర్, పోలీస్, రెవిన్యూ అనుమతులు తీసుకోవాలని, ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా బాణసంచా నిలువచేసినా, తయారుచేసినా, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహించినా... చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పిఠాపురం రూరల్ ఎస్సై ఎల్. గుణ శేఖర్ హెచ్చరించారు. మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ... నివాస గృహాల మధ్య, రద్దీ ప్రాంతాల్లో... బాణాసంచా తయారు చేయరాదని, నిల్వచేయరాదని, విక్రయించరాదని అన్నారు. బాణాసంచా తయారు చేసేవారు కచ్చితంగా లైసెన్స్ కలిగి ఉండాలని, తయారు చేసిన బాణసంచా నిల్వ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తగిన అనుమతులు పొందిన బాణసంచా విక్రయదారులు మాత్రమే తగు జాగ్రత్తలతో బాణసంచాను విక్రయించాలని, అనుమతి లేనివారు బాణాసంచా విక్రయించరాదన్నారు. నివాస గృహాల మధ్య ఎక్కడైనా ఆక్రమంగా బాణసంచాను నిలువ చేసినా, తయారు చేసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# మద్దూర్ లో సిసి రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన



**కంకిపాడు,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** మండలంలోని మద్దూరు గ్రామంలో హరిజనవాడలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఎన్ఆర్జిఎస్ నిధులు 5లక్షల నిధులతో నిర్మించే సిసి రోడ్ నిర్మాణానికి ఎంపీటీసీ శ్రీనివాసరావు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ప్రణాళిక బద్ధంగా రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామదాసు, కాసరనేనివారి పాలెం సర్పంచ్ పెద్ది ప్రసాద్, టిడిపి నాయకులు మదన్, తిట్ల మధు, రావి శ్రీనివాసరావు, అప్పారావు, రాజేష్, నాని, వల్లే నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి..

● అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీమతి పి గాయత్రి







**గుడివాడ,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** గుడివాడ నియోజకవర్గ పరిధిలోని నందివాడ మండలం.. నందివాడ గ్రామంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని గౌరవ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీమతి పి. గాయత్రి సందర్శించారు.. ఈ సందర్భంగా వసతి గృహంలో విద్యార్థులతో ముచ్చటించారు. వారికున్న ఇబ్బందులను తదితర వాటి గురించి అడిగి తెలుసు కున్నారు. అలాగే వసతి గృహం నిర్వాహకులను ప్రశ్నించారు.. ముఖ్యంగా విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల లీగల్ సెల్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పోలీస్ అమర వీరుల సంస్మరణ రక్తదాన శిబిరం





**గుడివాడ,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గుడివాడ పట్టణ సిఐ కొండపల్లి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో స్థానిక వెలమ సంక్షేమ భవనంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గుడివాడ శాఖ సహకారంతో స్థానిక వెలమ కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కృష్ణాజిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆర్ గంగాధర్ రావు ప్రారంభించగా.. స్థానిక పోలీస్ సిబ్బంది వికేఆర్ & వి ఎన్ బి ఇంజనీరింగ్ కళాశాల మరియు ఏఎన్ఆర్ కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐ కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సేవలను కొనియాడుతూ ఎస్పీ గంగాధర్ రావు విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించినందుకు ధన్యవాదాలు తెలిపారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ తోట శ్రీరంగ సత్య బాలాజీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సమరణార్థం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయని పోలీస్ వారి సేవలు మరువలేనివి అని పేర్కొన్నారు. జిల్లా సెక్రటరీ భవిరి శంకర్ నాథ్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానమని ఒకరు చేసిన రక్తదానంతో రక్త కణాలు ప్లేట్లెట్స్ ప్లాస్మా ద్వారా ముగ్గురికి ప్రాణదానం చేయవచ్చునని, ప్రతి ఒక్కరూ రక్తదానాన్ని ఒక అలవాటుగా మార్చుకోవాలని తెలియపరిచారు. కార్యక్రమంలో స్థానిక రెడ్ క్రాస్ చైర్పర్సన్ స్పందన, వైస్ చైర్మన్ మడకా ప్రసాద్, ఆర్కే వెలమ సంక్షేమ సంఘ కార్యదర్శి జి ప్రభాకర్, డాక్టర్ పట్టాభి రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హనుమంతయ్య బ్లడ్ బ్యాంక్ సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

# డ్వాక్రా సంఘాల మెప్మా బజార్ ప్రారంభించిన కూటమి నేతలు..

● మహిళా సోదరీమణుల ఉత్పత్తులను ప్రజలు ప్రోత్సహించాలన్న : మాజీ ఎమ్మెల్యే రావి, మాజీ చైర్మన్ యలవర్తి





**గుడివాడ,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెప్మా అర్బన్ మార్కెట్ ను మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు లు మంగళవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్లో ఏర్పాటు చేసిన ఉత్పత్తులను కూటమి నాయకులు పరిశీలించారు. పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలనే సంకల్పంతో ప్రభుత్వం అర్బన్ మార్కెట్లను ప్రోత్సహిస్తుందని మాజీ ఎమ్మెల్యే రావి, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి పేర్కొన్నారు. మెప్మా మార్కెట్ ను సందర్శించి పట్టణ ప్రజలు ప్రోత్సహించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, రూరల్ మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, నాయకులు కొడాలి రామరాజు, ముళ్ళపూడి రమేష్ చౌదరి, మెప్మా అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన శ్రీదేవి శరన్నవరాత్రులు..

● బుధవారం భారీ అన్న సమారా సమారాధన నిర్వహించిన ఉత్సవ కమిటీ సభ్యులు..



**గుడివాడ,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** స్థానిక 31వ వార్డులో శ్రీదేవి శరన్నవరాత్రుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధనను మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, గుడివాడ జనసేన పార్టీ ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, ప్రారంభించారు. ముందుగా నాయకులు అమ్మవారికి పూజా కార్యక్ర మాలు నిర్వహించి, భక్తులకు భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ యలవర్తి, శ్రీకాంత్ మాట్లాడుతూ 31వ వార్డు భక్తబృందం ఆధ్వర్యంలో ఎంతో వైభవంగా శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ముగియడంతో నేడు నిర్వహిస్తున్న అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలం దరూ సుభిక్షంగా ఉండాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షిం చారు. 2 వేల మందికి సమారాధన నిర్వహించినట్లు ఈ సందర్భంగా కమిటీ సభ్యులు తెలియచేశారు. అన్న సమారాధన కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వసంతవాడ దుర్గారావు, టిడిపి నాయకులు బొంబాయి శ్రీను, మిక్కిలినేని రమేష్, పెద్ద సంఖ్యలో భక్తులు, 31వ వార్డు దసరా ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వడ్లమన్నాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం..



**గుడివాడ,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** గుడ్లవల్లేరు మండల పరిధిలోని వడ్లమన్నాడు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి లోయ సునీల్, వెటర్నరీ వీణ లు నిర్వ హించారు. ప్రస్తుతం పై పాటుగా కాంప్లెక్స్ ఎరువులు వాడకుండా సూటి ఎరువులు వాడుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. యూరియా ఎక్కువగా వాడటం వల్ల దోమపోటు ఎక్కువగా ఉంటుందని, కావున రైతులు ప్రస్తుతం వరి పంటకు యూరియా వాడనవసరం లేదని పొటాష్ వేయాలని సూచించారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు గురించి రైతులకు క్లుప్తంగా వివరించారు. ప్రస్తుతం వరి పంటలో పాటించవలసిన యాజమాన్య పద్ధతుల గురించి వివరిస్తూ రైతుల యొక్క సందేహాలకు సమాధానాలు ఇచ్చి రైతులకు తెలియజేశారు. రైతులు పండించిన ధాన్యం రైతు సేవా కేంద్రం ద్వారానే అమ్మాలని నీ బంధన లేదు. ఒకవేళ అంతకన్నా ఎక్కువ ధర లభిస్తే రైతు తాము పండించిన ధాన్యం ప్రైవేటు వ్యాపారాలకు గాని, వ్యాపారులకు గాని లేదా మిల్లర్లకు గాని అమ్ముకునేందుకు కనీస మద్దతు ధర కన్నా ఎక్కువ ధర బయట నుండి రావాలన్నదే మా తపన అన్నారు. అమ్మకపు వివరాలు మాత్రమే సమాచారం కోసం ఆర్.బి.కె. తెలియచేస్తే చాలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు స్వామి, తెలుగుదేశం పార్టీ వడ్లమన్నాడు అధ్యక్షులు పెన్నేరు రమేష్, జనసేన గుడ్లవల్లేరు మండల అధ్యక్షులు చిన్నారి, మండా మురళి నాంచారయ్య, గరికిపాటి వెంకటేశ్వరరావు, బొప్పన శుభ్రమణ్యం, కాగిత రాంబాబు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# మంత్రి కందుల దుర్గేష్ ను కలిసిన ఎమ్మెల్యే పంతం నానాజీ



**కాకినాడ రూరల్,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ని వారి కార్యాలయంలో కాకినాడ రూరల్ నియోజకవర్గ శాసన సభ్యులు పంతం వెంకటేశ్వరరావు (నానాజీ )మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేలు బోలిశెట్టి శ్రీనివాస్ , బొమ్మిడి నాయకర్ ఉన్నారు.



గుడివాడ నియోజకవర్గం బొమ్ములూరు గ్రామంలో అమ్మవారి శరన్నవరాత్రులు నవరాత్రుల ముగిసిన సందర్భంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుత్తా శివరామకృష్ణ (చంటి) తో పాటు గ్రామ గ్రామ పెద్దలు అందరు కలిసి కార్యక్రమం జయప్రదం చేసినారు..
–గుడివాడ,అక్టోబరు 23 (వార్తాప్రభ) :

# ఈనెల 30న శ్రీ భీమేశ్వర స్వామి వారీ దేవస్థానము హుండీల లెక్కింపు కార్యక్రమం..

**గుడివాడ, అక్టోబరు 23 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా, గుడివాడ పట్టణం, బంటుమిల్లి రోడ్డులో వేంచేసి యున్న శ్రీభీమేశ్వర స్వామివారి దేవస్థానమునకు భక్తులు సమర్పించిన కానుకలు మ్రొక్కుబడులు హుండీలను 8.24.10.2024 వ తేదీ. గురువారం ఉదయం. గం"10.00.లకు నుండి శ్రీ తనిఖీదారు, దేవదాయ, ధర్మదాయశాఖ గుడివాడ వారి పర్యవేక్షణలో భక్తుల సమక్షములో తెరచి లెక్కించబడును అని తెలియపరచిన విషయమై తమకు తెలియపరచునది ఏమనగా రేపు జరగవలసిన హుండీ లెక్కింపు అనివార్యకారణములచే తిరిగి ది. 30.10.2024 వ తేది అనగా బుధ వారము ఉదయం 10.00 నుండి నిర్వహించబడునని తెలియపరచుకొనుచున్నాను. కావునా భక్తులు గమనించ గలరు అని ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణు గోపాల రావు గారు ఒక ప్రకటనలో తెలియజేసినారని తమ దినపత్రిక నందు వార్త గా ప్రచురించవలసినదిగా తెలియజేయదమైనది.

# తాసిల్దార్,ఎస్. ఐ.లుగా బాధ్యతలు స్వీకరించిన అధికారులకు 139 బీసీ కులాల నేతల సన్మానం






**గిద్దలూరు, అక్టోబరు 23 (వార్తాప్రభ) :** 139 కులాల జేఏసీ జిల్లా ఉపాధ్యక్షులు పరదేశి రాజశేఖర్ ఆధ్వర్యంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన రాచర్ల మండల తహసిల్దార్ వెంకటేశ్వర్లు ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో పూలమాలతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి రాష్ట్ర కార్యదర్శి ఒబిలి బోయిన వెంకటయ్య మాట్లాడుతూ రాచర్ల మండలంలోని గ్రామాలలో రీ సర్వేలో జరిగిన అవకతవకల గురించి తహసిల్దారు కి తెలియజేసినారు. తహసిల్దార్ సానుకూలంగా స్పందించి పరిష్కారం చేస్తానని అన్నారు తర్వాత కొత్తగా బాధ్యతలు చేపట్టిన రాచర్ల మండల ఎస్సై కోటేశ్వరరావు ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో పూలమాలతో సన్మానించడం జరిగింది. ఒబిలి బోయిన వెంకటయ్య మాట్లాడుతూ ఎవరైనా మీ దగ్గరికి సమస్యలతో వచ్చినప్పుడు సామరస్యంగా పరిష్కారం చేస్తారని ఆశిస్తున్నామని అన్నారు. ఎస్సై పరిష్కారం చేస్తానని సానుకూలంగా స్పందించినారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగాల బాలయ్య యాదవ్, బీసీ నాయకులు కోటి లింగాచారి, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు యాదవ్, జేఏసీ ప్రధాన కార్యదర్శి బి ఓబులేష్, జేఏసీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఎన్ రాజయ్య, బీసీ సంఘ నాయకులు ఏం ఉమామహేశ్వర్, జేఏసీ ఉపాధ్యక్షులు నంద్యాల ఈశ్వరయ్య యాదవ్, రాచర్ల మండల నాయకులు సోమవరపు ఆరోగ్యం, 139 కులాల నాయకులు జఫ్ఫుల్ల ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

**గుడివాడ ముదినేపల్లి రోడ్డులో దొండపాడు వెళ్లే క్రాస్ రోడ్డు వద్ద గల వంతెన ముందు కరెంటు తీగలకు అడ్డుగా ఉన్న చెట్లను నరికి కాలువలో వేసినారు. ఏడు రోజులైనను ఇంతవరకు తొలగించలేదు 20 గ్రామాలకు మంచినీటి కాలువ అయిన దొండపాడు కాలువలో నరికిన చెట్లను వేయుట వలన నీరు కిందికి వెళ్ళుటకు అడ్డుగా ఉన్న వి కనుక సంబంధిత అధికారులు వెంటనే చెట్లను తొలగించి నీరు కిందకు వెళుటకు సహకరించవలసిందిగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గుడివాడ శాఖ చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు మరియు స్థానిక ప్రజలు కోరుతున్నారు..**
–గుడివాడ,అక్టోబరు 23 (వార్తాప్రభ) :



# పవర్ లిఫ్టింగ్ పోటీలలో ఏ.ఎన్.ఆర్. కళాశాల విద్యార్థులకు పతకాలు



**గుడివాడ,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** ఎన్.టి.ఆర్. మరియు కృష్ణాజిల్లా అంతర్ జిల్లాల పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన పవర్ లిఫ్టింగ్ జూనియర్ మరియు సీనియర్ పురుషుల పోటీలు జరిగాయి. ఈ పోటీలలో 53కిలోల విభాగములో (1) బి.అబిషేక్, ద్వితీయ సంవత్సరం బి.ఎస్.సి. కంప్యూటర్ సైన్సు బంగారు పతకము మరియు స్ట్రాంగ్ మెన్ గా (2) ఎన్. దుర్గాప్రసాద్, మొదటి సంవత్సరం బి.ఎస్.సి. మాథెమాటిక్స్, బ్రాంజ్ పతకము, 66 కిలోల విభాగములో (3) పి.కార్తిక్, మొదటి సంవత్సరం బి.ఎస్.సి. కెమిస్ట్రీ, కాంస్య పతకము, 59 కిలోల కేటగిరిలో (4) పి.జె.వి.దుర్గ ప్రసాద్, మొదటి సంవత్సరం బి.ఎస్.సి. స్టాటిస్టిక్స్ బ్రాంజ్ పతకము, 66 కిలోల విభాగములో (5) ఎ.జాన్ వెస్లీ, మొదటి సంవత్సరం బి.ఎస్.సి. మాథెమాటిక్స్, బ్రాంజ్ పతకము, 83 కిలోల విభాగములో (6) సి.హెచ్. ప్రవీణ్, మొదటి సంవత్సరం బి.ఎస్.సి. కెమిస్ట్రీ, కాంస్య పతకము, 90 కిలోల విభాగములో (7) నాగులపల్లి సుహాస్, మొదటి సంవత్సరం ఎం.బి.ఎ., బంగారు మరియు కాంస్య పతకాలు సాధించారని మరియు వీరు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాదించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్. కుమార్ తెలియజేసారు. ఈ కార్యక్రమములో కళాశాల పాలక వర్గ ప్రెసిడెంట్ యల్.ఆర్.కే. ప్రసాద్, సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ కె.ఎస్. అప్పారావు మరియు వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్. పద్మజ, ఫిజికల్ డైరెక్టర్ వీర్ల గోపి విద్యార్థులను అభినందించారు.

**In the Court of the VIIth Addl. District Judge At Vijayawada**
**M.V.O.P. No. 56/2013**
Between :-
Devineni Naga Mani And Others ... Petitioners
And
Saara Ravi And Others ... Respondents
To
R-1 : Saara Ravi, S/o. Krishnaiah, Lorry Driver, R/o. 3-4, Sarvaya Palem (V), Kavali (M), Nellore Dt. - 524201

పై నెంబరు గల పిటీషను 1వ పిటీషనరు యొక్క భర్త గారు రోడ్డు ప్రమాదంలో మరణించగా సదరు మరణానికి నష్టపరిహారం కోరుతూ దాఖలు చేయగా 1వ రెస్పాండెంటు అయిన మీ యొక్క హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారి ఎదుట ది. 25-10-2024వ తేదీకి వాయిదా అయి వున్నది. కావున ది. 25-10-2024వ తేది ఉదయం గం. 10-30 ని.లకు హాజరై మీ అక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల వరోక్షంగా తీర్మానించ బడును.

(By Order Order)
I. మురళీ కృష్ణధర్
CH. సతీష్ కుమార్
న్యాయవాదులు
విజయవాడ.
సెల్ నెం. : 9246474096
8985061753

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188